సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | శుక్రవారం 15 మే 2026
సంపుటి: 17 | సంచిక: 137
పేజీలు: 08 | వెల: రూ.2:00
Published from Hyderabad, Vijayawada.



## జిన్‌పింగ్‌పై ట్రంప్ ప్రశంసలు

### తనకుమంచి స్నేహితుడని అంటూ పొగడ్తలు

### ఇరు దేశాల మధ్య శిఖరాగ్ర సదస్సులో ట్రంప్

బీజింగ్,మే14(సాక్ష్యం): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత జిన్‌పింగ్ మధ్య గురువారం బీజింగ్‌లో ఉన్నత స్థాయి సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మిగతా 2 లో..



## కేరళ సీఎంగా వీడీ సతీశన్

- ఉత్కంఠకు తెరదించిన కాంగ్రెస్
- పదరోజుల కసరత్తు అనంతరం ప్రకటన

తిరువనంతపురం,మే14(సాక్ష్యం): కేరళ సీఎం పోస్టుపై ఉత్కంఠ వీడింది. ఆ రాష్ట్రానికి తదుపరి సీఎంగా వీడీ సతీశన్ ను కాంగ్రెస్ అధిష్ఠానం మిగతా 2 లో..



## ఎవరూ అధైర్య పడవద్దు

### చివరిగింజ వరకు కొంటాం రైతులకు మంత్రి ఉత్తమ్ హామీ

ఖమ్మం,మే14(సాక్ష్యం): రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి మిగతా 2 లో..



## ఇంటర్ విద్యా విధానంలో మార్పులు

- ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్ పరీక్షలు
- మార్పులకు సిద్ధం అవుతున్న బోర్డు

హైదరాబాద్,మే14(సాక్ష్యం): ఇంటర్ విద్యా విధానంలో తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కీలక మార్పులు చేపట్టేందుకు మిగతా 2 లో..

## 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ

### మూడవ దశ జాబితాలో ఉభయ తెలుగు రాష్ట్రాలు

### సర్ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన



న్యూఢిల్లీ,మే14(సాక్ష్యం): దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల 'ప్రత్యేక విస్తృత సవరణ' (సర్) మూడవ దశను ప్రారంభించనున్నట్లు భారత ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లడఖ్ మినహా దేశం మొత్తం 'సర్' పరిధిలోకి వస్తుందని ఈసీ మిగతా 2 లో..

# పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు

### నీట్-యూజీ2026 రద్దు.. మోడీ సర్కార్ ఫెయిల్

### మోడీ హయాంలోనే 93 పేపర్ల లీక్

### ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు

### కేంద్రం తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్,మే14(సాక్ష్యం): నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్ష రద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గతపదేండ్లుగా ప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం మిగతా 2 లో..

# మహిళా శక్తి

### సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకం

### తొలిసారిగా భారీ డంపర్లను నడపనున్న మహిళా కార్మికులు

### మహిళా శక్తికి ప్రాధాన్యతపై స్పందించిన సింగరేణి సంస్థ

### వివిధ క్లిష్టతం బాధ్యతల నిర్వహణపై మహిళలకు అవకాశాలు

### హెవీ మోటార్ వెహికిల్ శిక్షణను పూర్తిచేసిన మహిళా ఉద్యోగులు



హైదరాబాద్,మే14(సాక్ష్యం): మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యనిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థలో కూడా మహిళా శక్తికి తగు ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని ఆదేశించడంతో సింగరేణి చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్ల ఆపరేటర్లుగా కొందరు మహిళలకు కంపెనీ అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశంపై సింగరేణి యాజమాన్యం మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్‌ను గని క్వారీ నుండి ఉపరితలానికి రవాణా చేయడానికి యాజమాన్యం 60 నుంచి మిగతా 3 లో..






# సంపాదకీయం

## కాన్వాయ్‌ల కార్లు తగ్గితే పొదుపు కాదు !

అధికార పార్టీ నేతల విన్యాసాలు మొదలయ్యాయి. చమురు సంక్షోభం దృష్ట్యా ఖర్చులు తగ్గించుకోవాలని, వర్క్ ఫ్రమ్ హోమ్ పెరగాలని, బంగారం కొనొద్దని ఇలా..ప్రధాని పలు సూచనలు చేశారు. వాటిని బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు, ఎన్‌డిఎ పాలిత సిఎంలు స్వాగతించారు. ఇందులో కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను మాత్రమే తగ్గించారు. ప్రధాని కూడా కాన్వాయ్ తగ్గించారు. నిజానికి రాజకీయంగా దుబరా ఖార్చుల గురించి ఆలోచించడం లేదు. ఓ వైపు విమాన ఇంధన ధరలు పెంచడంతో విమానాలను రద్దు చేస్తున్నారు. ఇది సామాన్యులపై పెనుభారం మోపుతోంది. విదేశీయానం అంటే ప్రజలు ఎంజాయ్ చేయడానికి వెళ్లడం లేదు. తమ పిల్లల దగ్గరకు వెళ్లాలన్న తల్లిదండ్రులకు వియారన టిక్కెట్ ధరలు తడిసి మోపెడు అవుతున్నాయి. వీటిని ఆదా చేసేందుకు ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. కాన్వాయ్‌ల తగ్గింపుతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాదు. ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా ఉన్న వందలాది పతకాలు, రాజకీయ పార్టీల ఖర్చులు వంటివి తగ్గాలి. శాసనమండళ్లతో పెద్దగా పనిలేదు. జడ్పీటిసి, ఎంపిటిసిలతో పెద్దగా పనిలేదు. వీటిని తగ్గించాలి. ప్రజాప్రతినిధులు రెండేసి పెన్షన్లు తీసుకుంటున్నారు. ఈ పెన్షన్లను పూర్తిగా రద్దు చేయాలి. ఈ ఖర్చు ఎంతో లెక్క కట్టాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాద ఘంటికలు మోగిస్తోన్న వేళ ఎక్కడ ఖర్చులు తగ్గించాలో మోడీ చెబితే బాగుంటుంది. ఆచరిస్తే మరీ మంచిది. ప్రజాస్వామ్యం పేరుతో ప్రజాప్రతినిధులు ప్రజల డబ్బుతో విలాసాలు చేస్తున్నారు. దీనిపై ప్రధాని మోడీ దృష్టి సారించాలి. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మన దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆర్థిక సంక్షోభం దిశగా పయనిస్తున్న తీరును చూస్తున్నాం. వరుసగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి విలువ పతనం కొనసాగడం, ద్రవ్యోల్బణం అడ్డు అదుపులేకుండా పెరగడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, ఇవన్నీ కలిపి దేశ ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ క్రమంలో దేశ ఆర్థిక వ్యవస్త బలోపేతానికి పొదుపు చర్యలు తీసుకోవాల్సిందే. కఠిన చర్యలకు ఉపక్రమించాలి. కేవలం కాన్వాయ్‌ల కార్లు రద్దుతో చేతులు దులుపుకుంటే సరిపోదు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేసిన పొదుపు సూచనలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేశాయి. స్టాక్‌మార్కెట్లు కుప్పకూలి, లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి కావడం, విదేశీ పెట్టుబడు దారులు పెద్ద ఎత్తున నిధులు వెనక్కి తీసుకోవడం వంటి పరిణామాలన్నీ ఆర్థికసంక్షోభ తీవ్రతకు అద్దం పడుతున్నాయి.అదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న తీరు మరింత ఆందోళనకరం. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి చేరి 13 నెలల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆహార ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగడం సామాన్య కుటుంబాల పై తీవ్రమైన భారం మోపుతోంది. పప్పుధాన్యాలు, కూరగాయలు, వంటనూనెలు, పాల ఉత్పత్తుల ధరలు వరుసగా పెరుగుతుండగా, ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరుగు తుండటం, అసంఘటిత రంగంలో ఉపాధి క్షీణించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల నిధులను తెగ్గోయడం వంటి చర్యలు ఇప్పటికే ప్రజల కొనుగోలు శక్తిని దారుణంగా దెబ్బతీశాయి. దీనికితోడు ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదని సూచనలు చేస్తున్నారు. ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా కూడా ఇదే విషయం చెప్పారు. ధరాఘాతం నుండి ప్రజలకు ఊరటనిచ్చే చర్యలు తీసుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం మరింతగా భారాలు మోపేందుకు కసరత్తు చేయడం దారుణం! అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరుగుతుండటాన్ని సాకుగా చూపుతూ పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచడానికి ఇప్పటికే సిద్ధమైంది. 'పెట్రో ధరలు పెరగవని నేను చెప్పలేను అంటూ సాక్షాత్తు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ ప్రకటించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇదే మాదిరి కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చంటూ రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన వ్యాఖ్యలతో దేశంలో పెట్రో మోత తప్పదని తేలిపోయింది. అయితే, ఏ స్థాయిలో ధరలు పెరుగుతాయి, ఎప్పటి నుండి పెరుగుతాయి అన్న అంశంపైనే స్పష్టత రావాల్సిఉంది. నాలుగేళ్లుగా పెట్రో ధరలు పెరగలేదంటూ తాజాగా చేయబోయే పెంపునకు సమర్థనగా కేంద్రం చేస్తున్న వాదనలు ఏ మాత్రం సమర్థనీయం కాదు. పెట్రో ధరలు పెరగ్గానే అమాంతంగా అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. నిత్యావసరాలు ఆకాశాన్ని అంటుతాయి. కాబట్టి ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలి. పొదుపు అన్నది ప్రజాప్రతినిదుల దుబారాలను తగ్గించడంతో మొదలు కావాలి. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం పెరిగి, దాని ప్రభావం అన్ని వస్తువులపై పడటం ఖాయం. బంగారం కోనుగోళ్లను ఏడాదిపాటు నిలిపి వేయాలని ప్రధాని సూచించగా, కేంద్ర ప్రభుత్వం తాజాగా బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 6 నుండి 15 శాతానికి పెంచడం కూడా ప్రజలపై భారాలు మోపడం తప్ప మరోటి కాదు. ప్రజలు త్యాగాలు చేస్తే ప్రజాప్రతినిధులు ఎంజాయ్ చేయడం ఎంతవరకు సమంజసం. లక్షల్లో జీతు, భత్యాలు, ఉచిత బంగళాలు, కరెంట్ ఫ్రీ, ఫోన్లు ఫ్రీ ఎందుకో చెప్పాలి. ఇవన్నీ ప్రజలను ఉద్ధరించే చర్యలు ఎంతమాత్రం కావు. దీనికితోడు చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఒత్తిడిలో ఉండటం, రైతాంగ ఆదాయం స్థిరంగా లేకపోవడం వంటి అంశాలు దేశ ఆర్థిక వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ధరల నియంత్రణ చర్యలు, ఉపాధి హామీ, వ్యవసాయ, చిన్న పరిశ్రమల రక్షణపై దృష్టి పెట్టాలి. పొదుపును సీరియస్‌గా తీసుకుని ప్రజాప్రతినిధుల జీతాలు, పెన్షన్లు రద్దు చేయాలి. వారి విదేశీ ప్రయాణాలను, విమానాలను వేసుకుని ఊరేగడాన్ని, హెలకాప్లర్లు వేసుకుని ఊరూరా తిరగడాన్ని అడ్డుకోవాలి. ఇవి మాత్రమే దేశానికి మేలు చేస్తాయి. ఈ దిశగా విప్లవాత్మక చర్యలకు దిగాలి.

## ఉమ్మడి పీజీ ప్రవేశపరీక్ష షెడ్యూల్

### నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్,మే14(సాక్ష్యం): ఉమ్మడి పీజీ ప్రవేశపరీక్ష (సీపీగెట్)కు నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 7 విశ్వవిద్యాలయాలతోపాటు జేఎన్‌టీయూహెచ్, కొత్తగూడెం ఎర్త్‌సైన్సెస్ వర్సిటీల్లో పీజీ సైన్స్ కోర్సుల్లో సీట్ల భర్తీకి నిర్వహించనున్న సీపీగెట్ షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, వర్సిటీల వైస్ ఛాన్సలర్లు(వీసీలు), కన్వీనర్ తదితరులు విడుదల చేశారు. తొలిసారి సీపీగెట్‌ను తమ వర్సిటీ నిర్వహిస్తోందని కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈసారి ఇంటర్ విద్యార్హతతో ప్రవేశాలు పొందే ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సీట్ల భర్తీ సీపీగెట్ ద్వారా ఉండదని, వాటిని దోస్త్‌లో చేర్చినట్లు తెలిపారు. కన్వీనర్ ఆచార్య రాజేందర్ మాట్లాడుతూ మొత్తం 45 సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆలస్య రుసుం లేకుండా జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.2 వేల ఆలస్య రుసుంతో 18 వరకు అవకాశం ఉంటుంది.



## ఎవరూ అధైర్య పడవద్దు

మొదటిపేజీ తరువాయి..

ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. గురువారం కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్, హమాలీల విషయంలో కొంత ఇబ్బంది ఉందని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఆ సమస్యను ప్రభుత్వం పరిష్కారింస్తోందని పేర్కొన్నారు. యాసంగిలో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి ఎక్కువగా హమాలీలు తెలంగాణకు వస్తారని చెప్పుకొచ్చారు. ఇటీవలే పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరగడం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. కేవలం ధాన్యం తరలించడానికి లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని అన్నిజిల్లాల కలెక్టర్‌లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీచేశారు.





# పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు

మొదటిపేజీ తరువాయి..

సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాం÷–రతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది పేరెంట్స్ నగలు అమ్మి తమపిల్లలనునీట్ ఎగ్జామ్ కు ప్రిపేర్ చేయించారని... వారి ఆశలన్నీగల్లంతవడం బాధాకరమన్నారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డికేడ్' శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలుజరిగాయని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్–యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి–నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్–నెట్, నీట్–పిజిరద్దుఅయినట్టు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్రద్దునేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దనిభరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

## జిన్‌పింగ్‌పై ట్రంప్ ప్రశంసలు

మొదటిపేజీ తరువాయి..

ఇరు దేశాల బృందాలను ఉద్దేశించి మాట్లాడిన అధ్యక్షుడు ట్రంప్ చైనా అధినేతపై ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్‌ను కలవడం తనకు గౌరవమని, ఆయన తనకు మంచి స్నేహితుడని కొనియాడారు. ఇరు దేశాలకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని వ్యాఖ్యానించారు. 'మా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. పొరపొచ్చాలు వచ్చినప్పుడు కూడా మాట్లాడుకుని త్వరగా పరిష్కరించాము. మీరు ఒక గొప్ప నాయకుడు. ఇలా నేను మిమ్మల్ని ప్రశంసించడం కొందరికి నచ్చకపోవచ్చు. కానీ నేను ఉన్నది ఉన్నట్టు చెబుతున్నాను. చైనా, అమెరికాలు కలిసికట్టుగా అధ్భుత భవిష్యత్తువైపు అడుగులు వేస్తున్నాయి ' అని ట్రంప్ అన్నారు. ఈ పర్యటన కోసం తాను అమెరికాకు చెందిన అత్యుత్తమ వ్యాపారవేత్తలను తీసుకొచ్చానని కూడా ట్రంప్ చెప్పారు. వారందరికీ చైనా అధినేత అంటే గౌరవమని చెప్పారు. ఇదే అతిపెద్ద శిఖరాగ్ర సమావేశమని కూడా వ్యాఖ్యానించారు. ఇక ఈ సమావేశాల ప్రారంభంలో చైనా అధినేత జిన్‌పింగ్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య సహకారం ఉండాలని అభిలషించారు. చైనా–యూఎస్ బంధం స్థిరంగా ఉండాల్సిన ఆవశ్యకత గురించి కూడా మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచం దృష్టి తమ రెండు దేశాలపైనే ఉందని అన్నారు. గత శతాబ్దంలో చూడని మార్పులు ప్రస్తుతం జరుగుతున్నాయని చెప్పారు.



అంతర్జాతీయంగా అల్లకల్లోల పరిస్థితులు ఉన్నాయని, ప్రపంచం నాలుగు రోడ్ల కూడలిలో ఉందని అభిప్రాయపడ్డారు. చైనా, యూఎస్‌లు తమ దౌత్య బంధంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని కూడా వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ శిఖరాగ్ర సమావేశంలో ఎన్‌విడియా సంస్థ సీఈఓ జెన్సన్ హువాంగ్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ సీఈఓ టిమ్ కుక్ పాల్గొంటున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం, ఇరాన్ యుద్ధం, టెక్నాలజీతో పాటు తైవాన్ అంశంపై కూడా చర్చించేందుకు ట్రంప్ చైనాలో పర్యటిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, ప్యాసింజర్ విమానాలను చైనాకు మరింతగా ఎగుమతి చేసేలా ఒప్పందం కుదుర్చుకునేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు.

## ఇంటర్ విద్యా విధానంలో మార్పులు

మొదటిపేజీ తరువాయి..

సిద్ధమైంది. 2026–27 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసింది. కొత్త విధానంలో సైన్స్, మ్యాథ్స్, భాషా విభాగాల్లో పరీక్షల సరళి, మార్కుల విధానం, ప్రాక్టికల్స్ నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటి వరకు ఇంటర్ సెకండియర్‌లో మాత్రమే ప్రాక్టికల్స్ నిర్వహించగా, కొత్త విధానంలో ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టనున్నారు. ప్రత్యేకంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విభాగాల్లో ఫస్టియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. కొత్త విధానం ప్రకారం.. ఇంటర్ ఫస్టియర్‌లో,



సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనుంది. దీంతో విద్యార్థులు కేవలం థియరీకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. మ్యాథమేటిక్స్ బోధనలోనూ కీలక మార్పులు తీసుకురానుంది. సంప్రదాయ పద్ధతికి బదులుగా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను అమలు చేయనుంది. దీంతో విద్యార్థులు సూత్రాలను అర్థం చేసుకోవడం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించుకోవడం, కాన్సెప్ట్ ఆధారిత విద్యనభ్యసించడం వంటి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మ్యాథ్స్‌లో 75 మార్కులకు ÷నైల్ పరీక్ష నిర్వహిస్తుండగా, కొత్త విధానంలో దాన్ని 60 మార్కులకు తగ్గించనుంది. అదేవిధంగా యాక్టివిటీలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు ప్రాధాన్యం పెంచే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఇంటర్ పరీక్షలు 100 మార్కులకు నిర్వహించగా, ఇకపై వాటిని 80 మార్కులకు నిర్వహించనున్నట్లు సమాచారం. మిగిలిన మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రాక్టికల్స్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ద్వారా కేటాయించే అవకాశం ఉంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ వంటి భాషా విభాగాల్లో 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించనుంది. ఇందులో ప్రాజెక్టులు సెమినార్లు, అసైన్‌మెంట్లు, క్లాస్‌రూమ్ పనితీరు ఆధారంగా మార్కులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంతమేర తగ్గే అవకాశం ఉందని విద్యా నిపుణులు భావిస్తున్నారు. ఒక్క ÷నైల్ పరీక్ష ఆధారంగా కాకుండా, ఏడాది పొడవునా విద్యార్థుల పనితీరును అంచనా వేసే విధానం అమల్లోకి రానుంది. ఈ సంస్కరణలు జాతీయ విద్యా విధానం(ఔఇఖ)కు అనుగుణంగా తీసుకువస్తున్నట్లు సమాచారం. విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా విద్యా నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటర్ విద్యా విధానంలో వస్తున్న ఈ మార్పులు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## కేరళ సీఎంగా వీడీ సతీశన్

మొదటిపేజీ తరువాయి..

ఎంపిక చేసింది. ఈ పదవి కోసం కె.సి.వేణుగోపాల్, రమేశ్ చెన్నితాల నుంచి గట్టి పోటీ ఎదురైంది. చివరకు సతీశన్‌నే ముఖ్యమంత్రి పదవి వరించింది. గత నెలలో జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయం సాధించింది. మొత్తం 140 స్థానాల్లో పోటీపడిన ఈ కూటమి 102 చోట్ల విజయం సాధించింది. అయితే ముఖ్యమంత్రి పదవికి పోటీ ఎక్కువగా ఉండటంతో సతీశన్ ఎంపికకు అధిష్ఠానం పది రోజుల సమయం తీసుకోవడం గమనార్హం. కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. మంచి వక్తగానూ గుర్తింపు వచ్చింది. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, ఎలాంటి గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. పాలనాపరంగా ఎలాంటి అనుభవం లేని సతీశన్‌ను ప్రతిపక్ష నేతగా నియమిస్తూ తీసుకున్న నిర్ణయంపై అప్పట్లో పలువురు అనుమానం వ్యక్తంచేశారు. కానీ ఎల్‌డీఎఫ్‌ను ఎదుర్కొనే నేతగా తనను తాను నిరూపించుకున్నారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు.

**LOST**

I, **H. FATHIMA TABASSUM** daughter of **MOHAMMED AZMATHULLAH** lost **my SSC certificate document** studied at Raghava Education Academy, Saptagiri Nagar- Hyderabad, which I kept in my bag near Niloufer Hospital- Nampally - **please call me at the following number if anyone finds it.**

**Mobile: 9640000783**

## ఢిల్లీలో మరో నిర్భయ ఘటన

న్యూఢిల్లీ,మే14(సాక్ష్యం): రాజధాని ఢిల్లీ మరోమారు నిర్భయ లాంటి ఘటన చోటుచేసుకుంది. తాజాగా షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. బస్సు డ్రైవర్, కండక్టర్ తనపై అత్యాచారం చేశారని ఒక వివాహిత ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. నగరంలోని రాణిబాగ్ ప్రాంతంలో సోమవారం రాత్రి ఈ దారుణం జరిగింది. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం, ఆమె మంగోల్‌పురిలోని ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. పీతమ్‌పురాలో నివసిస్తున్నారు. ఆమెకు ముగ్గురు పిల్లలు. కాగా, సోమవారం రాత్రి విధులు ముగించుకున్న ఆమె తిరిగివస్తుండగా సరస్వతీ విహార్ వద్ద ఒక స్లీపర్ బస్సు వచ్చి ఆగింది. బస్సు డోర్ వద్ద నిలబడి ఉన్న వ్యక్తి మొదట బాధితురాలిని టైమ్ అడిగి ఆ తరువాత బలవంతంగా బస్సులోకి ఎక్కించాడు. ఆ తరువాత బస్సును నాంగ్లోయ్ ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడి నిందితులు అఘాయిత్యానికి ఒడిగట్టారు.

# పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం

## వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్

## వారానికి ఒకరోజు నో వెహికిల్ డే

## సిఎం రేఖాగుప్తా పలు నిర్ణయాలు ప్రకటన

న్యూఢిల్లీ,మే14(సాక్ష్యం): దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ప్రజా రవాణా వినియోగంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కూడా కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పొదుపు సూత్రాల పిలుపు మేరకు ఢిల్లీ ప్రభుత్వం పలు



సంస్కరణాత్మక చర్యలను ప్రకటించింది. ముఖ్యమంత్రి రేఖాగుప్తా ఆధ్వర్యంలో తీసుకున్న ఈ నిర్ణయాలు ప్రభుత్వ ఖర్చులు తగ్గించడం, ఇంధన వినియోగ నియంత్రణ, ప్రజా రవాణా ప్రోత్సాహంపై కేంద్రీకృతమై ఉన్నాయి. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, ఇంధన వినియోగాన్ని నియంత్రించడం లక్ష్యంగా ఢిల్లీ ప్రభుత్వం ఉద్యోగులకు వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని అమలు చేయాలని



నిర్ణయించింది. ఈ నిర్ణయం రేపటి నుంచే అమల్లోకి వస్తుందని సీఎం రేఖా గుప్తా ఆదేశాలు జారీ చేశారు. ఈ విధానం వల్ల ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వాహనాల సంఖ్య తగ్గి, కాలుష్య నియంత్రణకు తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ ఖర్చులు తగ్గించడంలో భాగంగా సీఎం కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను నాలుగుకు పరిమితం చేశారు. ఇందులో రెండు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని నిర్ణయించారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది.
పౌరుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో 'నా భారతదేశం ? నా కర్తవ్యం' పేరుతో ప్రత్యేక ఉద్యమాన్ని ఢిల్లీ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమం 90 రోజుల పాటు కొనసాగనుంది. ఇంధన పొదుపు, ప్రజా రవాణా వినియోగం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రులు, ఉన్నతాధికారులు ప్రతి సోమవారం తప్పనిసరిగా ఢిల్లీ మెట్రోలోనే ప్రయాణించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిని 'మండే మెట్రో' పేరుతో ప్రత్యేక కార్యక్రమంగా అమలు చేయనున్నారు. ఈ నిర్ణయం ద్వారా ప్రజారవాణా వినియోగాన్ని ప్రోత్సహించడమే కాకుండా, ట్రాఫిక్ రద్దీ తగ్గించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. సామాన్య ప్రజలు కూడా వారంలో కనీసం ఒక రోజైనా 'నో వెహికిల్ డే' పాటించాలని ప్రభుత్వం సూచించింది. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి, సైకిళ్లు, మెట్రో, బస్సులు వంటి పర్యావరణహిత రవాణా మార్గాలను వినియోగించాలని కోరింది. ప్రభుత్వ శాఖలు వచ్చే ఆరు నెలల వరకు పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు చేయొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైతే ఇప్పటికే ఉన్న వాహనాలనే వినియోగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇది ప్రభుత్వ ఖర్చులను తగ్గించడమే కాకుండా, వనరుల సమర్థ వినియోగానికి దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను 10 శాతం పెంచుతూ ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ చర్య తీసుకున్నట్లు తెలిపింది. ప్రభుత్వ వ్యయ నియంత్రణలో భాగంగా వచ్చే ఏడాది వరకు అన్ని విదేశీ అధికారిక పర్యటనలను పూర్తిగా రద్దు చేశారు. అత్యవసర పరిస్థితులు మినహా విదేశీ ప్రయాణాలకు అనుమతి ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఢిల్లీ ఇప్పటికే వాయు కాలుష్య సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పర్యావరణ పరిరక్షణకు కీలకంగా మారే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వర్క్ ఫ్రం హోమ్, మెట్రో వినియోగం, నో వెహికిల్ డే వంటి చర్యలతో వాహనాల సంఖ్య తగ్గి కాలుష్యం నియంత్రణలోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

**GOOD NEWS TO FARMERS**

In pursuance to the Order o. SO 2900(E) dated 24.10.2015 issued by Department of Agriculture and Co-operation and Farmers Welfare Department, Government of India, we intend to manufacture and market following 100% Water Soluble Mixture of Fertilizers (in Liquid/Granular Form) in all the Districts of Telangana State.

| S.No. | TYPE OF FERTILIZERS | NUTRIENT PERCENTAGE |
|---|---|---|
| 1 | N:P:K | 19:19:19 |
| 2 | N:P:K | 0:12:45 |
| 3 | N:P:K:Mg:B | 15:05:30:02:0.02 |
| 4 | N:P:K | 24:24:16 |
| 5 | N:P:K | 15:08:35 |
| 6 | N:P:K | 13:40:13 |
| 7 | N:P:K:S | 16:00:09:19 |
| 8 | N:P:K | 10:05:30 |
| 9 | N:P:K | 28:28:00 |
| 10 | N:P:K:S | 9:27:18:7.5 |
| 11 | N:P:K | 20:20:20 |

These Fertilizers will be helpful to the farmers for development of crops and increase in high yields.

**M/s. SRIVEN AGRO SCIENCES**
Floor No.: SY no. 646, Building No./Flat No.: Ahalya Farms, Road/ Street: Deveryamjal (V), Nearby Landmark: Shakthi Seeds Pvt. Ltd., Locality/Sub Locality: Shameerpet (Mdl), City/Town/Village: Medchal Malkajgiri, District: Medchal Malkajgiri, State: Telangana, PIN Code: 500078. Ph: 9908391071, GSTIN: 36BPZPK2685G2Z5

# మహిళా శక్తి

మొదటిపేజీ తరువాయి..

100 టన్నుల భారీ డంపర్లను వినియోగిస్తుంది. సింగరేణిలో గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటివరకు కేవలం మగ ఆపరేటర్లు మాత్రమే ఈ భారీ డంపర్ లను నడుపుతూ వస్తున్నారు. ఎందుకంటే ఈ డంపర్లను నడపడం కొంత కష్టంతో పాటు శారీరక దృఢత్వం, డ్రైవింగ్ నైపుణ్యం అవసరమై ఉంటాయి, పైగా మండే ఎండల్లోనూ, భారీ వర్షాలు, తీవ్రమైన చలి పరిస్థితులను తట్టుకొని మూడు షిఫ్టుల్లో కూడా డంపర్లు నడపాల్సి ఉంటుంది. ఇంత కష్టతరమైన పనిని పురుష ఆపరేటర్లు మాత్రమే నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే సింగరేణి సంస్థలో ఇటీవల మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని, వారి నైపుణ్యాలను, శక్తి సామర్థ్యాలను కూడా వినియోగించడానికి తగు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల్లో డంపర్ ఆపరేటర్లుగా పని చేయడానికి ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను కోరింది. మొదట దాదాపు 35 మంది వరకు ముందుకు వచ్చారు. అయితే భారీ డంపర్లను నడపడానికి వారికి అంతకుముందే సాధారణ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు భారీ వాహనాలను నడిపే లైసెన్స్ కూడా అవసరమై ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న యాజమాన్యం సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్)అనే సంస్థ ద్వారా ఆసక్తి గల మహిళలకు కంపెనీ ఖర్చులతో భారీ వాహనాలపై ఉచిత డ్రైవింగ్ శిక్షణను అందించింది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 13 మంది మహిళా ఉద్యోగులు తాము డంపర్ ఆపరేటర్లుగా పనిచేయటానికి సంసిద్ధంగా ఉన్నామని కంపెనీకి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వీరందరికీ త్వరలో విడుదలయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకల్లో అవకాశం కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో సింగరేణి సంస్థ కూడా ఆ దిశగా కీలక అడుగులు వేస్తోంది. పురుషులకు మాత్రమే పరిమితమైన కఠినమైన పనుల్లో మహిళలకు సైతం ప్రాధాన్యతనిస్తూ సింగరేణి సంస్థ తొలిసారిగా డంపర్ ఆపరేటర్లుగా మహిళలకు కూడా అవకాశం కల్పించటానికి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది, ఈ విధంగా అనతి కాలంలోనే సింగరేణి సంస్థలో భారీ డంపర్లపై మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కనపడే అవకాశం ఉంది. సందర్భంగా కొందరు మహిళా ఆపరేటర్లు మాట్లాడుతూ, భారీ డంపర్లను నడపడం




శారీరక కష్టం, నైపుణ్యంతో కూడుకున్న పని అని, తాము చేయగలమో లేదో అని కొంత భయపడినప్పటికీ, స్వయంగా డంపర్లు నడుపుతున్నప్పుడు తాము కూడా ఇటువంటి పనులు చేయగమన్న ఆత్మవిశ్వాసం కలగిందన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాలతో పాటు రోదసిలోకి వెళ్తున్నారని కనుక గనిలోని డంపర్లను మహిళలు నడపడం అంత కష్టమేమీ కాదని, ఇటువంటి మంచి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి తాము ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.

సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, ఇంధన శాఖామాత్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లు ల ఆదేశాల మేరకు సింగరేణిలో మహిళా శక్తికి తగిన అవకాశాలు కల్పిస్తూ వస్తున్నామని, బెల్లంపల్లి ఖైరీగూడ ఓపెన్ కాస్ట్ గనిలో అత్యంత క్లిష్టమైన బ్లాస్టింగ్ విభాగంలో కూడా కేవలం మహిళలను మాత్రమే నియమించగా వారు పురుష ఉద్యోగులతో సమానంగా బ్లాస్టింగ్ ను నిర్వహిస్తున్నారని, అలాగే ఇతర విభాగాల్లో కూడా మహిళలు రాణిస్తున్నారని ఒక అధికారి పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో తొలిసారిగా మహిళా రెస్క్యూ జట్టును కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇలాగే ఇకపై కూడా వివిధ క్లిష్టతరమైన ఉద్యోగాలలో ఆసక్తి గల మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

**కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్**
బ్రాంచ్: 3-11-114, ప్లాట్ నెం. 2, 1వ అంతస్తు, శ్రీ నిలయం, ఆర్‌టిసి కాలనీ, ఎల్‌బి నగర్, హైదరాబాద్-500074. ఫోన్ నెం. 040-49501072/7625079163, ఇమెయిల్ ఐడి: lbnagar@canfinhomes.com CIN No. L85110KA1987PLC008699

**స్వాధీనత ప్రకటన**
**(రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 మరియు సదరు చట్టము క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ **కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్** వారి అధీకృత అధికారి అయిన ఈ క్రింద సంతకముదారు **తేది: 03-03-2026**తో జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారము రుణగ్రహీతలు అయిన **శ్రీ కమళ్ళ ప్రమోద్ కుమార్ తండ్రి కమళ్ళ యాదయ్య మరియు శ్రీ కమళ్ళ యాదయ్య తండ్రి శ్రీ లేన్ కమళ్ళ పెంటయ్యలను** నోటీసులో తెలిపిన బకాయి మొత్తం **రూ. 32,32,648/- (రూపాయలు ముప్పై రెండు లక్షల ముప్పై రెండు వేల ఆరు వందల నలభై ఎనిమిది మాత్రమే)** మరియు వసూలయ్యే తేదీ వరకు ఒప్పంద రేటు వంతున తదుపరి వడ్డీతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించమని కోరడమైనది.
సదరు రుణగ్రహీత రుణ బకాయి చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8తో చదవబడు సదరు చట్టములోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ ఈ క్రింద తెలిపిన ఆస్తిని ఈ క్రింది సంతకముదారు **తేది: 13 మే, 2026**న స్వాధీనము చేసుకోవడమైనదని రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.
సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.
కావున ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనియు, ఒక వేళ జరిపినట్లయితే కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ వారి చార్జీకి లోబడి రావలసిన బకాయి మొత్తం **రూ. 32,32,648/- (రూపాయలు ముప్పై రెండు లక్షల ముప్పై రెండు వేల ఆరు వందల నలభై ఎనిమిది మాత్రమే)** మరియు దానిపై వడ్డీ క్రింద వర్తించును.

**స్థిరాస్తి వివరణ**
**తెలంగాణ, హైదరాబాద్, రామ్‌దేవ్ గూడ వద్ద 105.5 చ॥గ॥లు దానికి సమానమైన 88.19 చ॥మీ॥ల విస్తీర్ణముతో ఇంటి నెం. 9-5-116/2/ఎ గల ఆస్తి యావదాస్తి. ఆస్తి సరిహద్దులు: తూర్పు: రోడ్డు, పడమర: ప్యాసేజ్ & పొరుగువారి ఇల్లు, ఉత్తరం: పొరుగువారి ఇంటి నెం. 9-5-116, దక్షిణం: లేన్.**

తేది: 14-05-2026, ప్రదేశం: ఎల్‌బి నగర్, హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

SILK MARK

**రాష్ట్ర స్థాయి చేనేత ప్రదర్శన-2026**

**చేనేత వస్త్ర ప్రదర్శన మరియు అమ్మకం**

**తేది 08-05-2026 నుండి 17-05-2026 వరకు**

ఉ॥ 10 గంటల నుండి రా॥ 10 గంటల వరకు

బనారస్ ప్రత్యేక సేకరణ | పశ్చిమ బెంగాల్ బొటిక్ వస్తువులు | తస్సర్ కాంత & ప్రింటెడ్ | చందేరి/మహేశ్వరి | కోట | రాజ్‌కోట్ పటోలా | పోచంపల్లి ఇక్కత్ | బెంగుళూరు ప్యూర్ క్రేప్ సిల్క్స్ | బీహార్ & జార్ఖండ్ టస్సర్ డ్రెస్ మెటీరియల్స్ | గద్వాల్ | కళంకారి | కాంచీపురం | పైథాని చీరలు | వెంకటగిరి / ఉప్పాడ జమదాని చీరలు మరియు కాటన్ డ్రెస్ మెటీరియల్స్ | బెడ్ షీట్స్ | జ్యూయిలరీ.

వేదిక : సత్యసాయి నిగమాగమం, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్

రండి... చేనేతల అద్భుతాలతో అనుభూతి చెందండి
చేనేతను ధరించండి మరియు ప్రోత్సహించండి

ప్రవేశం ఉచితం | అందరూ ఆహ్వానితులే

చేనేతకు ప్రోత్సాహం - నేతన్నల్లో ఉత్సాహం

సౌజన్యం: చేనేత అభివృద్ధి కమీషనర్, జౌళి మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వము, న్యూఢిల్లీ.

నిర్వహణ: కమీషనర్, చేనేత & జౌళి శాఖ తెలంగాణ, హైదరాబాద్.

**ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్**
ఎం.జి. రోడ్డు - సికింద్రాబాద్ (0200)
1-7-79/ఎ & బి, 1-7-95 నుండి 111, లెజెండ్ క్రిస్టల్, మండలే లేన్, పి.జి. రోడ్, సికింద్రాబాద్, తెలంగాణ-500 003.
ఫోన్: 040-23468829, 30 & 8925950200, ఇ-మెయిల్: lob0200@lob.bank.com

**స్థిరాస్తి అమ్మకము కొరకు అమ్మకపు ప్రకటన**
**అనుబంధము-4-ఎ (రూల్ 8(6) & 9(1)లోని నిబంధనలను చూడుము)**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదువబడుతూ క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా/కుదువ పెట్టిన క్రింద తెలిపిన స్థిరాస్తిని **ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్** వారి అధీకృత అధికారి ద్వారా **భౌతికముగా స్వాధీనము** చేసుకొని **ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్** వారి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెందిన రుణ బకాయి మొత్తము అనగా **రూ. 1,12,29,866.20 (రూపాయలు ఒక కోటి పన్నెండు లక్షల ఇరవై తొమ్మిది వేల ఎనిమిది వందల అరవై ఆరు మరియు పైసలు ఇరవై మాత్రమే) + 05-05-2026** నుండి ఒప్పంద రేటు వంతున వడ్డీతో **శ్రీ దెండి మధుకర్ రెడ్డి, శ్రీమతి దెండి కల్పన & దెండి సాయి దీక్షిత్ రెడ్డి** వారి నుండి బకాయి మొత్తము వసూలు చేసుకొనుటకు సదరు ఆస్తిని **"ఎక్కడ ఎలా ఉందో" మరియు "ఏది ఎలా ఉందో" "ఏదైతే ఎలా ఉందో అది అలానే మరియు రికోర్స్ పద్ధతి కాకుండా" తేది: 15-06-2026న అమ్ముటకు నిర్ణయించడమైనది.**

**సెక్యూర్డ్ ఆస్తి యొక్క షెడ్యూల్**
రంగారెడ్డి జిల్లా, చెర్ల పటేల్‌గూడ గ్రామ పంచాయతీ, ఇబ్రహీంపట్నం మం॥, ఖల్సా ఇబ్రహీంపట్నం గ్రా॥ వద్ద (హెచ్‌ఎండిఎ) (జెబిఎస్ సెరెనె సిటీ (ఫేజ్-2)లోని సర్వే నెంలు. 621, 622 & 623 లలోని ప్లాట్ నెం. 2 (ఉత్తర భాగము) విస్తీర్ణము 66 చ॥గ॥లు & ప్లాట్ నెం. 3 (దక్షిణ భాగము) విస్తీర్ణము 234 చ॥గ॥లు, మొత్తం విస్తీర్ణము 300 చ॥గ॥లు లేదా 250.83 చ॥మీ॥లతో నిర్మించబడిన గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియా: 1320 చ॥అ॥లు, మొదటి అంతస్తు: 1510 చ॥అ॥లు మరియు రెండవ అంతస్తు: 140 చ॥గ॥లు, మొత్తం ప్లింత్ ఏరియా: 2970 చ॥అ॥లు, ఆర్‌సిసి రూఫ్‌తో ఆవరణముల ఇంటి నెం. 6-3 (అసెస్‌మెంట్ నెం. 603) యావదాస్తి. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం. 3 (ఉత్తర భాగము), **దక్షిణం:** ప్లాట్ నెం. 2 (దక్షిణ భాగము), **తూర్పు:** జెట్స్ సెరీన్ సిటీ క్లబ్ హౌస్, **పడమర:** 60'-0" వెడల్పు రోడ్డు.
వేలం తేది: **15-06.2026,** ఇఎండితో బిడ్ దాఖలుకు ఆఖరి తేది: **12-06-2026న సా. 5.00 గం॥ల వరకు.**
అమ్మకము యొక్క వివరమైన నియమ నిబంధనలు కోసం ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ అనగా **https://www.iob.in/e-Auctions.aspx** మరియు **https://baanknet.com**లో ఏర్పాటు చేసిన లింక్‌ను దయచేసి రిఫర్ చేయండి.
వేలంలో పాల్గొనుట కొరకు మరియు ఐడి క్రియేషన్ కోసం కొనుగోలుదారులకు సులువుగా యాక్సెస్ కోసం డైరెక్ట్ యాక్సెస్ నుండి ప్లాట్‌ఫారం కొరకు దిగువ తెలిపిన URL ఉపయోగించవలెను.
**URL: https://baanknet.com.**
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద పైన తెలిపిన తేదీన ఇ-వేలం నిర్వహణకు సంబంధించి సదరు రుణం యొక్క రుణగ్రహీత/లు లకు మరియు హామీదారు/లు లకు దీనిని నోటీసుగా కూడా పరిగణించవలెను.

**తేది: 10-05-2026** — సం/- అధీకృత అధికారి
ప్రదేశము: హైదరాబాద్ — ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్

## అత్యుత్తమ మార్కులు సాధించిన బిసి విద్యార్థులు

### ప్రతిభా పురస్కారాలు అందచేసిన మంత్రులు

హైదరాబాద్,మే14(సాక్ష్యం): బంజారాహిల్స్ కొమురంభీం భవన్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ గురుకులాలు సంక్షేమ హాస్టళ్లలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



అందజేసారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రులు పొన్నం ప్రభాకర్,వాకిటి శ్రీహరిలు వీటిని అందించారు.కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు , బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బి. వెంకటేశ్వర్లు, రాజ్య సభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి , ఎంజేపి సెక్రటరీ సైదులు, బీసీ కమిషన్ సభ్యులు,బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి మాట్లాడుతూ.. విద్య వినయాన్ని ఇస్తుంది, వినయం వ్యక్తిని గొప్పవాడిని చేస్తుందని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. విద్య ప్రపంచాన్ని మార్చడమే కాకుండా, బానిసత్వం నుంచి బయటకు తీసుకు వస్తుందని నెల్సన్ మండేలా, మహాత్మా జ్యోతిరావు పూలే లు చెప్పారని గుర్తుచేశారు. తెలంగాణ రైజింగ్ లో ప్రతి విద్యార్థి భాగం కావాలి.విద్య ఎవరి సొత్తు కాదు, సరస్వతీ దేవికి రంగు, రూపు తేడా ఉండదు. విద్యపై మనం చూపే ఏకాగ్రతే మనల్ని ముందుకు నడిపిస్తుంది. గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నాం కనుక 100శాతం ఉత్తీర్ణత సాధించాలి. అన్ని రంగాల్లో బీసీలు ముందుండాలి. 100 సంవత్సరాలుగా చేయని కులగణన ను ప్రజా ప్రభుత్వం చేసింది. విద్యలో ఒత్తిడి ఉండొద్దని 25 వేల మంది టీచర్లకు బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చాం అవకాశాన్ని సృష్టించుకున్న వాళ్లే సమర్థులు అవుతారు. రాజకీయాలు అనగానే ఒక ధోరణి ని విడనాడాలి.భవిష్యత్ లో అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికై చట్టాలు చేయాలి. రాజకీయ నాయకులు చేసే చట్టాలు దేశ భవిష్యత్తును మారుస్తున్నాయి.
సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగం విప్లవాత్మకంగా మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారు.ప్రజా ప్రభుత్వం విద్యార్థుల కోసం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి శ్రీహరి వివరించారు.

**ICICI Home Finance** | **కార్పొరేట్ ఆఫీస్: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ICICI HFC టవర్, అంధేరి - కుర్లా రోడ్, అంధేరి (ఈస్ట్), ముంబై- 400059, ఇండియా**

**బ్రాంచ్ ఆఫీస్:** గ్రౌండ్ ఫ్లోర్, ఉషా కిరణ్ కాంప్లెక్స్, ఎస్.డి. రోడ్, సికింద్రాబాద్-500003, **బ్రాంచ్ ఆఫీస్:** సరయూ ప్లాజా, షాప్ నం. 2-10-874/2/సి, 1వ అంతస్తు, వడ్డేపల్లి గ్రామం, సుబేదారి, బ్యాంక్ కాలనీ, హన్మకొండ, వరంగల్, తెలంగాణ - 506001, **బ్రాంచ్ ఆఫీస్:** అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డి.నం: 11-28, షాప్ - 17, 18, 19, 20, సిద్దప్ప రోడ్, బృందావన్ కాలనీ, శంషాబాద్, హైదరాబాద్, తెలంగాణ 501218

**[రూల్ 8(6)కి సంబంధించిన నిబంధనను చూడండి] స్థిరాస్తుల అమ్మకపు నోటీసు**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002రూల్ 8(6)తో చదవబడిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 అనుసరించి స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకపు ప్రకటన.
దిగువ వివరించిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాగా/ఛార్జ్ చేయబడిందని సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కి దీని ద్వారా నోటీసు ఇవ్వబడింది, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి స్వాధీనం చేసుకోవడం జరిగింది, ఇవ్వబడిన సంక్షిప్త వివరాల ప్రకారం, **"ఎక్కడ ఎలా ఉందో అక్కడ అలా", "ఉన్నది ఉన్నట్లుగా"** మరియు **"ఏదయితే ఉందో అది"** అనే వాటిపై విక్రయించబడతాయి.

| క్ర. సం. | రుణగ్రహీత(లు)/ సహ రుణగ్రహీతలు/ హామీదారులు/ చట్టపరమైన వారసుల పేరు లోన్ అకౌంట్ నం. | సెక్యూర్డ్ అసెట్(లు)కు తెలిసినంతవరకు ఎన్‌కంబ్రెన్స్, ఇంకా ఏవైనా | మొత్తం బకాయి | రిజర్వ్ ధర / ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ | ప్రాపర్టీ తనిఖీ తేదీ మరియు సమయం | వేలం తేదీ & సమయం | వేలం తేదీకి ఒక రోజు ముందు | SARFAESI స్టేజి |
|---|---|---|---|---|---|---|---|---|
| (ఎ) | (బి) | (సి) | (డి) | (ఇ) | (ఎఫ్) | (జి) | (హెచ్) | (ఐ) |
| 1. | ఆవుల రాకేష్ (రుణగ్రహీత) ఆవుల సరవ్వ (సహ-రుణగ్రహీత) Loan No. LHNDH00001597291 | ఇంటి నం. 8-371/6/2, పిటిన్ నం. 1150802196, ప్లాట్ నం. 131/ఎ/పార్ట్, సాయిబాబా నగర్, కుత్బుల్లాపూర్ గ్రామం, కుత్బుల్లాపూర్ మండలం, జిహెచ్‌ఎంసి సర్కిల్ కుత్బుల్లాపూర్ పరిధిలో, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ | రూ. 19,84,648/- మే 08, 2026 | రూ. 54,14,400/- / రూ. 5,41,440/- | జూన్ 09, 2026 ఉ॥ 11:00 గం॥ల నుండి మ॥ 03:00 గం॥ల వరకు | జూన్ 16, 2026 మ॥ 02:00 గం॥ల నుండి సా॥ 03:00 గం॥ల వరకు | జూన్ 15, 2026 సా॥ 05:00 గం॥ల లోపు | సింబాలిక్ స్వాధీనం |
| 2. | చిలుకాటి మధు (రుణగ్రహీత), చిలుకాటి మద్దిలేటి (సహ-రుణగ్రహీత) చిలుకాటి సంధ్య (సహ-రుణగ్రహీత) Loan No. LHKNO00001588011 | ఇం.నం. 14-54, విద్యానగర్, కొత్తకోట మండలం, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ-509381 | రూ. 11,58,601/- మే 08, 2026 | రూ. 89,43,480/- / రూ. 8,94,348/- | జూన్ 09, 2026 ఉ॥ 11:00 గం॥ల నుండి మ॥ 03:00 గం॥ల వరకు | జూన్ 16, 2026 మ॥ 02:00 గం॥ల నుండి సా॥ 03:00 గం॥ల వరకు | జూన్ 15, 2026 సా॥ 05:00 గం॥ల లోపు | సింబాలిక్ స్వాధీనం |
| 3. | వెలగ అనిల్ (రుణగ్రహీత), వెలగ లత (సహ-రుణగ్రహీత) Loan No. LHNDH00001593249 | ఇంటి నం. 5-6-1/2/Nr, పిటిన్ నం. 1140501443, దయార్‌గూడ, మూసాపేట్ గ్రామం, జిహెచ్‌ఎంసి కూకట్‌పల్లి సర్కిల్, బాలానగర్ మండలం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ-500072. | రూ. 52,55,334/- మే 08, 2026 | రూ. 97,22,700/- / రూ. 9,72,270/- | జూన్ 09, 2026 ఉ॥ 11:00 గం॥ల నుండి మ॥ 03:00 గం॥ల వరకు | జూన్ 16, 2026 మ॥ 02:00 గం॥ల నుండి సా॥ 03:00 గం॥ల వరకు | జూన్ 15, 2026 సా॥ 05:00 గం॥ల లోపు | సింబాలిక్ స్వాధీనం |
| 4. | పుట్ట సతీష్ కుమార్ (రుణగ్రహీత), పుట్ట స్రవంతి (సహ-రుణగ్రహీత) Loan No. LHWNL00001507036, LHWNL00001371673 | రెసిడెన్షియల్/కమర్షియల్ ల్యాండ్ డి.నం. 18-7-137, లే అవుట్ బొమ్మల్‌గుడియా, కరీమాబాద్, వరంగల్-506002 యొక్క యావత్తు. | రూ. 25,97,476/- మే 11, 2026 | రూ. 43,34,400/- / రూ. 4,33,440/- | జూన్ 09, 2026 ఉ॥ 11:00 గం॥ల నుండి మ॥ 03:00 గం॥ల వరకు | జూన్ 16, 2026 మ॥ 02:00 గం॥ల నుండి సా॥ 03:00 గం॥ల వరకు | జూన్ 15, 2026 సా॥ 05:00 గం॥ల లోపు | సింబాలిక్ స్వాధీనం |

ఆన్‌లైన్ వేలం మా వేలం ఏజెన్సీ వాల్యూట్రస్ట్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క వెబ్‌సైట్ **(URL Link-https://BidDeal.in)** లో నిర్వహించబడుతుంది. తనఖాదారులు/ నోటీసుకు జూన్ 15, 2026 సాయంత్రం 05:00 గంటలలోపు వరకు తదుపరి వడ్డీతో మొత్తం బకాయిలు చెల్లించడానికి చివరి అవకాశం ఇవ్వబడింది. లేనట్లయితే ఈ సెక్యూర్డ్ అసెట్స్ పై షెడ్యూల్ ప్రకారం విక్రయించబడతాయి.
కాబోయే బిడ్డర్(లు) ఆర్టికల్ పైన పేర్కొన్న ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ బ్రాంచ్ ఆఫీస్ అడ్రస్‌లో జూన్ 15, 2026 సా॥ 4:00 గం॥లలోపు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఇఎండి) ఆర్‌టిజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) (కాలమ్ ఇ ని చూడండి) సమర్పించాలి. కాబోయే బిడ్డర్(లు) తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ఫారమ్ & బిడ్ నిబంధనలు మరియు షరతుల ఫారమ్ యొక్క సంతకం కాపీని కూడా ఆర్టికల్ పైన పేర్కొన్న ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ బ్రాంచ్ ఆఫీస్ చిరునామాలో జూన్ 15, 2026న సాయంత్రం 05:00 గంటలలోపు సమర్పించాలి. ఆర్టికల్ పైన పేర్కొన్న బ్రాంచ్ ఆఫీస్ అడ్రస్‌లో చెల్లించవలసిన "ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్. - వేలం"కు అనుకూలంగా జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంక్ నుండి ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) ఉండాలి.
తనిఖీ, వేలం లేదా టెండర్ల సమర్పణ యొక్క నిబంధనలు మరియు షరతులకు సంబంధించి ఏవైనా మరిన్ని వివరణల కోసం, దయచేసి ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ని 9920807300లో సంప్రదించండి.
అధీకృత అధికారికి ఇతర కారణాలను తెలుపకుండానే ఏదైనా లేదా అన్ని బిడ్‌లను తిరస్కరించే హక్కు ఉంది. విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి **https://www.icicihfc.com**ని సందర్శించండి.

తేదీ : మే 15, 2026
ప్రదేశం : మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, వరంగల్
**అధీకృత అధికారి, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**
CIN Number:- U65922MH1999PLC120106

## ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

### అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి,మే14: 2026-27 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని వివిధ శాఖలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వివిధ శాఖలపై గురువారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టేట్ ఓన్ రెవెన్యూస్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,04,345 కోట్లుగా ఉంటే... 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 1,10,643 కోట్లుగా నమోదైందని వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ నుంచి రూ.33,679 కోట్లు, గనుల శాఖ నుంచి రూ. 10,300 కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి రూ.11,047 కోట్ల మేర ఆదాయం వచ్చిందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్టేట్ ఓన్ రెవెన్యూలో 6 శాతం వృద్ధి నమోదైందని సీఎం వివరించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.1,27,506 కోట్ల మేర ఆదాయాన్ని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందని వెల్లడించారు. గనులు, ఎక్సైజ్, స్టాంపులు రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు, రవాణా తదితర శాఖలు లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయంలో ప్రతీ రూపాయి సద్వినియోగం అయ్యేలా ప్రభుత్వ శాఖలు చూడాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, ఆర్థిక, రవాణా, ఎక్సైజ్, గనులు, స్టాంపులు రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు, అటవీ, పురపాలక శాఖల అధికారులు హాజరయ్యారు.

## 40 అంశాలకు క్యాబినెట్ ఆమోదం

**రూ.2లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే 25 ప్రాజెక్టులకు ఓకే**

**ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులకు అనుమతి**

**ఎపి కేబినేట్‌లో కీలక నిర్ణయాలు**


అమరావతి,మే14: ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 40కి పైగా అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.2లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే 25 ప్రాజెక్టులతో పాటు ఉద్యోగాల కల్పనపై కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శుద్ధ ఇంధనం, ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజ్,



బయోగ్యాస్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. శుద్ధ ఇంధన రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలిపేలా క్యాబినెట్ చర్యలు తీసుకుంది. ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ ప్రణాళిక కు ఆమోదం తెలిపింది. డేటా సెంటర్లు, ఆటోమొబైల్, సిమెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడుల ఆమోదంపై చర్చించింది. కర్నూలు విమానాశ్రయం పీపీపీ మోడల్‌లో అభివృద్ధి ప్రతిపాదన చర్చకు వచ్చింది. వివిధ సంస్థలకు భూముల కేటాయింపులపై క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఎంఎస్ఎంఈలకు నిధుల సౌలభ్యానికి ప్రత్యేక ఏర్పాటుపై చర్చించింది. సాగునీటి కాల్వల విస్తరణ, రోడ్లు, పరిశ్రమలకు మౌలిక సదుపాయాలపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఇకపోతే మంత్రివర్గ సమావేశానికి వివిధ శాఖల కార్యదర్శులు సకాలంలో రాకపోవడంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంధన పొదుపుపై మొదటి అజెండాగా చర్చిద్దామని మంగళవారమే సీఎం చెప్పారు. సమావేశంలో అధికారులు లేకపోవడంపై సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను చంద్రబాబు ప్రశ్నించారు. సమాచారం సరిగా ఇవ్వలేదా అని సీఎం ప్రశ్నించగా.. ఇచ్చినట్లు విజయానంద్ సమాధానమిచ్చారు. సమయానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. అజెండా అంశాలు ముగిశాక తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చర్చించారు.

## 16 నాటికి అండమాన్‌లోకి నైరుతి ప్రవేశం

విశాఖపట్నం,మే14: నైరుతి బంగాళాఖాతం- పశ్చిమ మధ్య బంగాళాఖాతం సమీపంలో అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఇదే ప్రాంతంలో సముద్ర మట్టానికి 5.9 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాగల 48 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ, యానాంలో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు, గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని తెలిపారు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా



కదులుతున్నాయని, ఈనెల 16 నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవులను తాకే అవకాశముందన్నారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 16నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతంలో ప్రవేశించే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారిందని పేర్కొన్నది. గురువారం నుంచి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ఈనెల 22 వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపుతాడని హెచ్చరించింది. గడిచిన 24 గంటల్లో నిజామాబాద్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా బీర్పూర్‌లో 44.4, కామారెడ్డి జిల్లా బిచ్కుందలో 44.2, సిద్దిపేట జిల్లా కోహెడలో 43.9, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో 43.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వివరించింది. వచ్చే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వడగాల్పులు ఎక్కువగా ఉంటా యని 11 గంటల తర్వాత బయటకు వెళ్లే సమయాల్లో తగిన జాగ్రత్తలు తీ సుకోవాలని సూచించింది.

# పొదుపు మంత్రంపై కేబినేట్‌లో చర్చ

**వారానికి ఓ సారి వెహికిల్ హాలిడే ప్రతిపాదన**

**వర్క్‌ఫ్రమ్‌పైనా మావేశంలో సుదీర్ఘ చర్చ**

**మంత్రులు సైకిళ్లపై సచివాలాయానికి రావాలసి సూచన**

**ప్రజలకు అవహ్యాన కల్పించాలని నిర్ణయం**

అమరావతి,మే14: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది.
ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించిన పొదుపు చర్యలపై ప్రత్యేకంగా కేబినెట్‌లో చర్చించారు.
ఏపీలో ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోంపై చర్చించినట్లు సమాచారం. సూర్యఘర్, పీఎం కుసుంను సీరియస్‌గా తీసుకోవాలని సీఎం ఆదేశించారు. దేశాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కాన్వాయ్‌ల తగ్గింపుతో సరిపోదని.. మరిన్ని పొదుపు చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రజలకు ముందుగా అవగాహన కల్పిద్దామని తెలిపారు. వారానికి ఒక రోజు నో వెహికల్ డే పాటిద్దామని పిలుపునిచ్చారు. కొన్ని రోజులు మంత్రుల విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాడాలని సూచించారు. అవసరమైతే సెక్రటేరియట్‌కి సైకిల్ మీద రావాలని మార్గనిర్దేశం చేశారు. సంక్షోభ నిర్వహణ అందరికీ రావాలని సూచించారు. సంక్షోభాన్ని మేనేజ్ చేయడం అందరు తెలుసుకోవాలని సూచించారు. ఈ విషయంలో మంత్రులు, అధికారులకు బాధ్యత ఉంటుందని తెలిపారు. దేశాన్ని మనం కాపాడుకోవాలని చెప్పారు. అందరం



కాన్వాయ్‌లు తగ్గించుకుంటే సరిపోదని అన్నారు. ఇంకా ఇతర పొదుపు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాడే వాహనాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకోవాలని మార్గనిర్దేశర చేశారు. మంత్రులు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు లేదా.. ఈవీ, సైకిల్ వినియోగించాలని నిర్ణయించారు. జిల్లాల పర్యటనల్లోనూ కాస్ట్ కటింగ్ పాటించాలని నిర్ణయం తీసుకున్నారు. అధిక సంఖ్యలో సమావేశాలు వర్చువల్‌గా నిర్వహించాలని తెలిపారు. ప్రెజెన్స్ అవసరం లేని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఖర్చులు తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. పొదుపు చర్యలని మనం ఒకేసారి ప్రజలకు చెబితే ఇబ్బంది పడతారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. నిదానంగా వెళ్దామని పవన్ కల్యాణ్ సూచించారు. రెండు రోజుల పాటు మనం ప్రజలకు అన్ని పొదుపు చర్యలు వివరిద్దామని సీఎం అన్నారు. అలానే చేద్దామని మిగతా మంత్రులు చెప్పారు. వర్క్ ఫ్రం హోం, కార్ పూలింగ్ పాటించాలని సీఎం సూచించారు. ఆయా శాఖల్లో చేపట్టాల్సిన పొదుపు చర్యలపై కార్యదర్శులు నివేదిక ఇవ్వాలని కోరారు. ఒక కేబినెట్ సబ్‌కమిటీని నియమిస్తే బాగుంటుందని వివరించారు. ముందుగా ప్రజలకు అన్ని విషయాలు విడమర్చి చెబుదామని మంత్రులు ప్రస్తావించారు.
ప్రజలకు అవగాహన కలిగించిన తర్వాత మనం ఒక నిర్ణయం తీసుకుందామని డిప్యూటీ సీఎం చెప్పారు. అలాగే చేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. కాగా, మంత్రివర్గ సమావేశానికి కార్యదర్శులు సమయానికి రాకపోవడంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా సమావేశం ఉందని చెప్పిన రాకపోతే ఎలా అని సీరియస్ అయ్యారు. సీరియస్‌నెస్ లేకపోతే ఎలా అని మందలించారు. ఈ భేటీకి సమయానికి రానివాళ్ల పేర్లు రాసుకుని సీరియస్ యాక్షన్ తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగాల కల్పనపై కీలక ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కర్నూలు ఎయిర్‌పోర్ట్ పీపీపీ మోడ్‌లో అభివృద్ధిపై చర్చించారు. వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై నిర్ణయం తీసుకున్నారు. ఓ÷ూఓఇలకు నిధుల సౌలభ్యానికి ప్రత్యేక టీంను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సాగునీటి కాల్వల విస్తరణ, రోడ్లు, పరిశ్రమలకు మౌలిక సదుపాయాలపై మాట్లాడారు. శుద్ధ ఇంధనం, ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చారు. పంప్డ్ స్టోరేజీ, బయో గ్యాస్ యూనిట్లకు అనుమతి ఇచ్చారు. శుద్ధ ఇంధనం రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. విద్యుత్ సంస్థల్లో ఇంజినీరింగ్ పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అగ్రిగోల్డ్ కేసులపై ప్రత్యేక బృందాన్ని నియమించాలని మంత్రిమండలి సమావేశంలో నిర్ణయించారు.

# స్థానిక ఎన్నికలపై జనసేన కసరత్తు

### విస్తృతస్థాయిలో పార్టీ నేతల సమీక్షలు

### నేడు సాధక్‌లతో పవన్ కళ్యాణ్ భేటీ

విజయవాడ,మే14:
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు రాజకీయంగా కీలకంగా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరగబోయే ఈ ఎన్నికల్లో కూటమి పార్టీల బలం మరోసారి చాటనుంది. ప్రత్యేకంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రాజకీయ ఆధిపత్యం కోసం ప్రధాన పార్టీలు ఇప్పటికే వ్యూహరచన ప్రారంభించాయి. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనసేన పార్టీ వార్డుల పునర్విభజన, రాజకీయ పరిస్థితులపై విస్తృత స్థాయిలో సమీక్షలు నిర్వహిస్తోంది. నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన



సమావేశంలో జిల్లాల వారీ నివేదికలు సమర్పించడం, కూటమి వ్యూహాలపై చర్చించడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పనిచేసిన సాధక్‌లతో పవన్ కల్యాణ్ సమావేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన పార్టీ దృష్టి సారించింది. పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వార్డులు, డివిజన్ల పునర్విభజన అంశంపై కిలక సమావేశం నిర్వహించింది. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన ఈ భేటీకి పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రానున్న మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రాజకీయ పరిస్థితులు, వార్డుల పునర్విభజన, కూటమి వ్యూహాలపై సమగ్ర చర్చ జరిగింది. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనల మేరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ప్రత్యేక కమిటీలను నియమించారు. ఈ కమిటీలు ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా ? గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ ప్రాంతాల వారీగా స్థానిక సంస్థల రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేశాయి. కమిటీ సభ్యులు ఆయా జిల్లాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో పర్యటించి స్థానిక రాజకీయ పరిస్థితులను పరిశీలించారు. ప్రత్యేకంగా కూటమి బలాబలాలు, వార్డుల పునర్విభజన ప్రభావం, స్థానిక నాయకత్వ పరిస్థితులు, ఓటర్ల ధోరణి, ఎన్నికల వ్యూహాలు వంటి అంశాలపై అధ్యయనం చేసి నివేదికలు సిద్ధం చేశారు. ఈ నివేదికలను నాదెండ్ల మనోహర్‌కు కమిటీ సభ్యులు అందజేశారు. ఈ సమావేశంలో కూటమి స్ఫూర్తిని కొనసాగిస్తూ స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ జరిగింది. తెలుగుదేశం జనసేన, బీజేపీ కూటమి స్థానిక స్థాయిలో కూడా సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజల్లోకి వెళ్లే విధానం, స్థానిక నాయకుల సమన్వయం వంటి అంశాలపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు, కమిటీలు సమర్పించిన నివేదికలను నాదెండ్ల మనోహర్.. పవన్ కల్యాణ్‌కు అందజేయనున్నారు. ఆ నివేదికల ఆధారంగా స్థానిక ఎన్నికలపై జనసేన తుది వ్యూహాన్ని రూపొందించే అవకాశం ఉంది. ఇక జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పనిచేసిన సాధక్‌లతో పవన్ కల్యాణ్ శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. 300కు పైగా సభ్యత్వాలు నమోదు చేసిన సాధక్‌లను పార్టీ హైకమాండ్ ప్రత్యేకంగా గుర్తించి ఈ సమావేశానికి ఆహ్వానించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొననున్నారు. ఇటీవల జనసేన చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా మంచి స్పందన లభించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు కార్యకర్తలు విస్తృతంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించినట్లు సమాచారం. ఈ క్రమంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన సాధక్‌లను ప్రోత్సహించేందుకు పవన్ కల్యాణ్ ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

## గార్బేజీ స్టేషన్‌లో జెసిబి వాహనాలు

విజయవాడ,మే14: విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌లో 5 జేసీబీ వాహనాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్(వీఎంసీ) ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సెంట్రల్ నియోజకవర్గంలో గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌లో జేసీబీ వాహనాల ప్రారంభం ఆనందదాయకమని అన్నారు. గతంలో ఈ ప్రాంత వాసులు అనేక సమస్యలతో ఇబ్బంది పడేవారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బోండా ఉమా.. నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి కారణం ఎమ్మెల్యే ఉమా అనడంలో అతిశయోక్తి లేదన్నారు. డ్రైనేజ్‌లు, రోడ్లను సుందరీకరణగా తీర్చిదిద్దామన్నారు. గత ప్రభుత్వంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో చిన్న పనులు కూడా జరగలేదని విమర్శించారు. గ్రేటర్ విజయవాడ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకుని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. జేసీబీ యాజమాన్యానికి ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్లమెంట్ సభ్యులు నిరంతరం కేంద్రం నుంచి నిధులు తెస్తున్నారని ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు తెలిపారు. ప్రధాని, సీఎం.. ప్రతినెల స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటూ ప్రత్యేక దృష్టి పెడుతున్నారన్నారు. గతంలో చెత్తా చెదారంగా ఉన్న ఈ ప్రాంతాన్ని టీడీపీ ప్రభుత్వం.. చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా మారుస్తోందని అన్నారు. విజయవాడ నగర అభివృద్ధి ఎంపీ కేశినేని శివనాథ్ కృషికి నిదర్శనమన్నారు.

## 18న అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం

**వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్న కలెక్టర్**

విజయవాడ,మే14: ఈ నెల 18న అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో వైభవంగా వేడుకలు నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. నగరంలోని చరిత్రాత్మక బాపు మ్యూజియం కేంద్రంగా ఆ రోజున ఎన్టీఆర్ జిల్లా టూరిజం కౌన్సిల్, ఆర్కియాలజీ విభాగం, ఆంధప్రదేశ్ టూరిజం, విజయవాడ ఉత్సవ కమిటీ సంయుక్తంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. 1887లో స్థాపించిన బాపు మ్యూజియం స్వాతంత్ర్యోద్యమ చరిత్రకు నిలువెత్తు సాక్ష్యమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య.. మహాత్మా గాంధీకి జాతీయ పతాకాన్ని అందించిన



చారిత్రక ప్రదేశంగా ఈ మ్యూజియానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా బాపు మ్యూజియంలోని విక్టోరియా హాల్‌లో నిర్వహించే లేజర్ షోకు ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సాంకేతికత, డిజిటలైజేషన్, మ్యూజియంల భవిష్యత్తు' అనే అంశంపై నిపుణులతో ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. విద్యార్థులతో సంగీత, వోకల్ ప్రదర్శనలు ఆకట్టుకునేలా ఉంటాయని తెలిపారు. సాయంత్రం మున్సిపల్ స్టేడియం వద్ద భారీ స్థాయిలో 'లైవ్ మ్యూజికల్ కాన్సర్ట్' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 14 మ్యూజియాల్లో కూడా అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణ న్యాయం

### ముగ్గురు సభ్యులతో కమిటీకి సిఎం ఆమోదం

అమరావతి,మే14: అగ్రిగోల్డ్ బాధితులకు ఆరునెలల్లో న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సీఎం అధ్యక్షతన గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయడానికి సంబంధించి ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని సీఎం ఆదేశించారు. ఎనిమిది రాష్ట్రాల్లో 19 లక్షల మంది బాధితులు ఉన్నారని తెలిపారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 11 లక్షల మంది బాధితులు ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ కేసులో బాధితుల సొమ్ము తిన్న వారిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలోని కొంతమంది కీలక అధికారులు ఉన్నారని వెల్లడించారు. అందువల్లే ఈ కేసుపై ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని ఆదేశించారు. అగ్రిగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన వారందరికీ తప్పనిసరిగా న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# పదేపదే విమర్శలు తగని పని

## అభివృద్ధి కోసం కష్టపడితే అడ్డుకోవడం సరికాదు

## వైసిపి నేత బైరెడ్డి తీరుపై మండిపడ్డ మంత్రి టిజి భరత్

కర్నూలు,మే14: అదే పనిగా విమర్శలు యచేయడం మానుకోవాలని వైసీపీ నేత బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డిపై ఏపీ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కర్నూలు వేదికగా ఆయన మీడియాతో మాట్లాడారు. కర్నూల్‌లో తమ పోలింగ్ బూత్ ఇన్‌చార్జి సునీల్‌పై హత్యాయత్నం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై పోలీసులు బాలు అనే వైసీపీ వ్యక్తిని విచారించారని అన్నారు. దీంతో ఈ అంశాన్ని డ్రామా రూపంలో బైరెడ్డి తెరపైకి తీసుకువచ్చారని ధ్వజమెత్తారు. ఆయనకు మైండ్ లేక ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు. బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి ఒక జోకర్ అని జగన్‌కు కూడా తెలుసునని ఎద్దేవా చేశారు. తనపై లేని పోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. ఇంతవరకూ తమపై బైరెడ్డిలాగా ఆరోపణలు చేసిన వారు ఎవరు లేరని అన్నారు. ఈ విషయంలో తాను బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డిపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఈ పరువు నష్టం దావా కేసును ఆయన ఎలా ఫేస్ చేస్తారో చూస్తానని వార్నింగ్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పరిశ్రమలు, కంపెనీల రాకకోసం తాము ఎంతగా కష్టపడుతున్నామో ప్రజలందరికీ తెలుసునని మంత్రి టీజీ భరత్ చెప్పుకొచ్చారు. ఐటీ కంపెనీలు, పరిశ్రమలు ఏపీకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు,



మంత్రి లోకేశ్, తాను ఎంతో కష్టపడుతున్నామని వ్యాఖ్యానించారు. సీబీఎన్ బ్రాండ్ మూలంగానే తాము వీటిని సాధించగలుగుతున్నామని ఉద్ఘాటించారు. తమ మైండ్‌ను డైవర్ట్ చేయడానికి కర్నూలుకు బైరెడ్డి అనే ఓ జోకర్ వచ్చారని ఎద్దేవా చేశారు. ఆయన ఇక్కడకు వచ్చి పిట్టకథలు చెబుతున్నారని సెటైర్లు గుప్పించారు. బైరెడ్డి కర్నూలుకు వచ్చి తనపై లేని పోని ఆరోపణలు చేశారని ధ్వజమెత్తారు. ఆయన చేసిన ఆరోపణలపై తాను పశ్చాత్తాపం చెందాల్సి వస్తోందని పేర్కొన్నారు. బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డికి చేతనైతే కర్నూలు నుంచి 2029 ఎన్నికల్లో వైసీపీ నుంచి టికెట్ తెచ్చుకోవాలని మంత్రి టీజీ భరత్ సవాల్ విసిరారు. ప్రజలు అప్పుడు ఆయనను గెలిపిస్తారో లేదో చూద్దామని అన్నారు.

బైరెడ్డి చిన్నవయసులోనే జైలుకెళ్లారని.. హత్యకేసులో కూడా ఉన్నారని ఆరోపించారు. ఓర్వకల్లులో పరిశ్రమల కోసం తాము ఎంతో కష్టపడుతున్నామని చెప్పుకొచ్చారు. ఆయన వీటి గురించి తెలియకుండా చిల్లరగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో వైరల్ అయితే.. తాను చాలా గొప్పవాడినని బైరెడ్డి అనుకుంటున్నారని విమర్శించారు.

అందుకనే ఆయనకు జోకర్ బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి అని పేరు పెడుతున్నానని ఎద్దేవా చేశారు. తాను సీరియస్‌గా రాజకీయాలు చేస్తే తట్టుకోగలవా అని ప్రశ్నించారు. ఆయనకు నోటికి వచ్చినట్లుగా ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. కర్నూలు వచ్చి స్టాండప్ కామెడీ షోలా.. బైరెడ్డి షో చేసి వెళ్లిపోయారని మంత్రి టీజీ భరత్ సెటైర్లు గుప్పించారు.

## ఉపాధి హామీ ద్వారా 137.97 లక్షల పనిదినాలు

విజయనగరం,మే14: జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 137.97 లక్షల పనిదినాలు కల్పించినట్లు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పనిదినాలకు సంబంధించి వేతనాల రూపంలో రూ.310.31 కోట్లు చెల్లింపులు వారి ఖాతాల్లో వేసినట్లు మంత్రి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జనరేట్ చేసిన మెటీరియల్ మొత్తం విలువ రూ. 173.60 కోట్లు కాగా.. జనవరి నెల వరకు రూ.71.67 కోట్లు చెల్లింపులు చేసినట్లు పేర్కొన్నారు. ఇంకా పెండింగ్ ఉన్న రూ. 101.93 కోట్లు త్వరలోనే లబ్ధిదారుల ఖాతాలో జమచేస్తామన్నారు.

## ట్రాన్స్‌జెండర్స్‌కు అండ

### వారు ఆత్మగౌరవంతో బతికేలా చర్యలు: మంత్రి డోలా

అమరావతి,మే14: ట్రాన్స్‌జెండర్స్ సమాజంలో ఆత్మగౌరవంతో జీవించాలన్నదే కూటమి ప్రభుత్వ ఆశయమని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వ్యాఖ్యానించారు. ట్రాన్స్‌జెండర్స్‌కి అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలో మంత్రి డీబీవీ స్వామి అధ్యక్షతన ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమం, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి కల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా డీబీవీ స్వామి మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్స్‌కి ఆస్పత్రుల్లో ప్రత్యేక ఓపీ సదుపాయం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. బహిరంగ ప్రదేశాలు, ఆస్పత్రుల్లో ట్రాన్స్‌జెండర్స్‌కి ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. సెర్ప్, మెప్మా సహకారంతో ట్రాన్స్‌జెండర్స్‌కి స్వయం ఉపాధి కల్పిస్తున్నామని వివరించారు. తిరుపతిలో గరీమా గృహం ఏర్పాటు చేసి నిరాశ్రయులైన వారికి ఆసరా కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. ట్రాన్స్‌జెండర్స్‌లోని 676 మందికి ఇప్పటికే గృహాలు కేటాయించామని తెలిపారు. వారి రక్షణ కోసం సీఐడీ కేంద్ర కార్యాలయంలో స్వాభిమాన్ పేరుతో ప్రత్యేక ప్రొటెక్షన్ సెల్, హెల్ప్‌లైన్ (1091) ఏర్పాటు చేశామని అన్నారు. ట్రాన్స్‌జెండర్స్‌కి గుర్తింపు కార్డులు, సింగిల్ రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని ప్రకటించారు. మనమిత్ర వాట్సాప్ యాప్, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా వారు ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డీబీవీ స్వామి పేర్కొన్నారు.

## పర్యాటక రంగంలో భారత్ - అమెరికా బంధం

అమరావతి,మే14: పర్యాటక రంగంలో భారత్ - అమెరికా బంధం బలోపేతమవుతోందని ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కు అమెరికా పర్యాటక పెట్టుబడులే లక్ష్యంగా సచివాలయంలో మంత్రి దుర్గేశ్‌తో 'యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్' భేటీ గురువారం జరిగింది. రాష్ట్ర పర్యాటక సంస్కరణలపై ప్రశంసలు కురిపించింది. అమెరికా ఇన్వెస్టర్ల దృష్టికి ఏపీ పర్యాటక రంగం విధానాలను తీసుకెళ్తామని వెల్లడించారు. ఏపీని గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చే ప్రక్రియలో ఇలాంటి భాగస్వామ్యాలు ఎంతో కీలకమని ప్రకటించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో విదేశీ పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. భారత్ - అమెరికా 75 ఏళ్ల మైత్రిపై మంత్రి దుర్గేశ్‌కి ప్రత్యేక పుస్తకం అందజేశారు.

## మరోమారు తెరపైకి ఫార్ములా కేసు

### కేటీఆర్, తదితరులకు ఏసీబీ నోటీసులు

### జూలై 31న విచారనకు రావాలని ఆదేశాలు

హైదరాబాద్,మే14(సాక్ష్యం): తెలంగాణలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ



చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3 హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి. జులై 31న విచారణకు రావాలని కోర్టు ఆదేశించింది. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగపత్రంలో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలతో సహా ఎఫ్ఈఓ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించింది. ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహణలో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఇప్పటికే లోతైన దర్యాప్తు జరిపి అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా మాజీ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ పేర్కొంది. వీరితో పాటు ఏ4గా స్పోర్ట్స్ కన్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫ్ఈఓ సంస్థపై కేసులు నమోదయ్యాయి. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేసు కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు నిధులు మళ్లించారన్నదే ప్రధాన అభియోగం. హెచ్ఎండీఏ ఖాతా నుంచి సుమారు 55 కోట్ల రూపాయలను ఎఫ్ఈఓ సంస్థకు బదిలీ చేసినట్లు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. ముందస్తు అనుమతులు లేకుండానే ఇంత భారీ మొత్తాన్ని విదేశీ సంస్థకు ఎలా చెల్లించారన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అరవింద్ కుమార్ సహా పలువురు ప్రతినిధులను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఏసీబీ కోర్టు ఈ కేసును విచారణకు స్వీకరించి సమన్లు జారీ చేయడంతో.. జూలై 31న కోర్టులో ఏం జరగబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

## పర్యావరణ హిత జీవనమే భావితరాలకు భద్రత

విజయవాడ,మే14: సింగిల్ యూజ్ ఎ÷-లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశముందని, ప్రతి ఒక్కరూ ఎ÷-లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా మానేసి పర్యావరణహితమైన గుడ్డ



సంచులను ఉపయోగించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి. లక్ష్మీశ పేర్కొన్నారు. గురువారం ఉదయం నిర్వహించిన నగర పర్యటనలో భాగంగా చిట్టినగర్, కొత్తపేట ప్రాంతాలను కలెక్టర్ విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధ అమలుపై ప్రజల్లో అవగాహన కల్పించారు. పర్యటనలో భాగంగా కొండ ప్రాంతంలోని ఒక దుకాణంలో సింగిల్ యూజ్ ఎ÷-లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న విషయాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే వ్యాపారులతో మాట్లాడి ఎ÷-లాస్టిక్ కవర్ల వినియోగం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. దుకాణాలకు వచ్చే వినియోగదారులను గుడ్డ సంచులు తీసుకొచ్చేలా ప్రోత్సహించాలని వ్యాపారులకు సూచించారు. అదేవిధంగా, షాపుకు వచ్చిన ఒక వ్యక్తి చేతిలో ఉన్న ఎ÷-లాస్టిక్ కవరును స్వయంగా తీసుకొని, తన వద్ద ఉన్న గుడ్డ సంచిని అందజేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, గుడ్డ సంచులు వంటి పర్యావరణ హిత మార్గాల ద్వారా ఎ÷-లాస్టిక్ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ ఓటింగ్ ప్రక్రియలో ప్రతి పౌరుడు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి స్వయంగా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయించి వారి అభిప్రాయాలను నమోదు చేయించారు. విజయవాడ నగర పరిశుభ్రతపై తమ అభిప్రాయాలను స్వచ్ఛ సర్వేక్షన్ ఫీడ్‌బ్యాక్ ద్వారా తెలియజేయాలని, జాతీయ స్థాయి ర్యాంకుల్లో విజయవాడను ఉత్తమ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పర్యటనలో చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్డీటీ ఓ సంస్థ కాదు..సేవా వ్యవస్థ

### ఆర్డీటీ ద్వారా అద్భుతమైన సేవా కార్యక్రమాలు

### మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్య

శ్రీ సత్యసాయి జిల్లా,మే14: ఆర్డీటీ ఓ సంస్థ కాదని.. గొప్ప సేవా వ్యవస్థ అని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఆర్డీటీ ద్వారా అద్భుతమైన సేవా కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకోవడం కోసమే తాను పాదయాత్ర చేశానని ప్రస్తావించారు. ఆర్డీటీ సంస్థకు సేవ చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఆర్డీటీకి అందరూ అండగా నిలవాల్సిన బాధ్యత ఉందని చెప్పుకొచ్చారు.



తాను చేపట్టిన యువగళం పాదయాత్రలో తాను ఆర్డీటీ సేవలు చూశానని.. ఇక్కడ అందుతున్న సేవలు తనను బాగా కదిలించాయని చెప్పుకొచ్చారు. గురువారం ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిని మంత్రి లోకేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. తాను చేపట్టిన పాదయాత్ర అనంతపురం దాటినా అనేకసార్లు ఆర్డీటీ గురించి తెలుసుకున్నానని తెలిపారు. గతంలో అనేక ఇబ్బందులు వచ్చాయని పేర్కొన్నారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ డెరెక్టర్ మాంచో ఫెర్రర్‌తో చాలాసార్లు మాట్లాడి ఫాలో ఆప్ చేశామని మంత్రి లోకేశ్ తెలిపారు. అద్భుతమైన సేవా కార్యక్రమాలు చేస్తోండటంతో తాను మద్దతు ఇచ్చానని అన్నారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఇలాంటి సంస్థలు, కష్టకాలంలో ఓర్పు, సహనంతో సేవలు చేస్తూ వచ్చిన మాంచోకి ధన్యవాదాలు తెలిపారు. ఆర్డీటీ సేవలు రాయలసీమకే కాదని.. ఏపీకి విస్తరించాలని కోరుకుంటున్నామని అన్నారు. ప్రేమతో సేవ చేయడం మాంచో కుటుంబం ఆశయమని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అంతకుముందు బత్తలపల్లిలో మంత్రి నారా లోకేశ్‌కు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఘనస్వాగతం పలికారు. పెద్దఎత్తున స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు లోకేశ్‌ను చూడటానికి తరలివచ్చారు. మంత్రి నారా లోకేశ్ రాకను పురస్కరించుకొని పెద్దఎత్తున టీడీపీ శ్రేణులు బాణాసంచా కాల్చారు. బత్తలపల్లి సెంటర్ నుంచి టీడీపీ శ్రేణులతో కలిసి లోకేశ్ భారీ ర్యాలీ తీశారు. అందరికీ అభివాదం చేస్తూ లోకేశ్ ముందుకు సాగారు.

## పేదల ఆకలి తీర్చడమే అన్నక్యాంటీన్ల లక్ష్యం

### పురపాలక శాఖ మంత్రి నారాయణ

విజయవాడ,మే14: పేదలకు నాణ్యమైన భోజనం అందించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం' అని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గత ప్రభుత్వాన్ని ప్రజలు ఎంత కోరినా అన్న క్యాంటీన్లను మూసివేసిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అన్న క్యాంటీన్ల నిర్వహణలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. కృష్ణలంక, రాణిగారితోటలోని అన్న క్యాంటీన్లను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పేదలకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. రూ.5 చెల్లించి టోకెన్ తీసుకున్న మంత్రి.. అందరితో కలిసి భోజనం చేశారు. ఆయనతో పాటు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర ఉన్నారు. అనంతరం క్యాంటీన్లలో ప్లేట్లు శుభ్రపరిచే విధానం, ఆహారం వడ్డించే ప్రాంతాల్లో పరిశుభ్రత, మినరల్ వాటర్, కూలర్లు, దోమతెరలు, ప్రత్యేక పార్కింగ్ వంటి సదుపాయాలను మంత్రి పరిశీలించారు. భోజనం చేస్తున్న ప్రజలను నేరుగా అడిగి ఆహారం నాణ్యతపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 'అన్న క్యాంటీన్లలో పరిశుభ్రమైన వాతావరణంలో ఎంతో రుచికరమైన ఆహారం అందిస్తున్నారు. వారానికి ఒకరోజు మున్సిపల్ కమిషనర్లు స్వయంగా భోజనం చేసి నాణ్యతను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లోనూ కొత్తగా అన్న క్యాంటీన్లు ప్రారంభించామని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు 3.5 లక్షల మంది అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారని మంత్రి నారాయణ వెల్లడించారు.

## చంద్రబాబు బాటలో ఎపి మంత్రులు

### కాన్వాయ్‌లో కార్లు తగ్గించుకున్న అమాత్యులు

అమరావతి,మే14: అంతర్జాతీయ చమురు సంక్షోభం నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పిన పొదుపు సూత్రాలను ఏపీ మంత్రులు పాటిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ తరహాలోనే మంత్రులు కాన్వాయ్‌ను కుదించుకుంటున్నారు. ఈరోజు(గురువారం) ఉదయం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్ అల్పాహార విందును ఏర్పాటు చేశారు. ఈ విందుకు రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు ఎస్కార్ట్ వాహనం లేకుండా విందుకు వచ్చారు. అలాగే మంత్రులు అనిత, గుమ్మడి సంధ్యారాణి, సవిత, కొల్లు రవీంద్ర, పార్థసారథి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, పయ్యావుల కేశవ్ తదితరులు.. ఎస్కార్ట్ కాకుండా ఒక్కో వాహనంలోనే సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చారు. మంత్రి నారాయణ కూడా కాన్వాయ్‌ను కుదించుకున్నారు. గతంలో మంత్రి నారాయణ కారుతో పాటు కాన్వాయ్‌లో మరో నాలుగు వాహనాలు ఉండేవి. ప్రస్తుతం వాహన శ్రేణిలోని రెండు వాహనాలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. నేటి నుంచి మంత్రి నారాయణ కాన్వాయ్ 50 శాతం తగ్గగా.. కేవలం రెండు వాహనాలతోనే సీఎం క్యాంపు ఆఫీసుకు మంత్రి చేరుకున్నారు. సీఎం చంద్రబాబు వాహనశ్రేణిని తొమ్మిది వాహనాల నుంచి నాలుగుకు కుదించారు. సీఎం వాహనాలు 50 శాతం కుదించడంతో ఆయన భద్రత చూసే ఎన్ఎస్‌జీ కోసం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఇకపై ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ.. సీఎం కాన్వాయ్‌లో బస్సులోనే వెనుక వెళ్లనుంది. మంత్రి నారా లోకేశ్ కాన్వాయ్ సగానికి కుదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సీఆర్‌పీఎఫ్ భద్రత ఉండటంతో లోకేశ్ కాన్వాయ్‌లో మొత్తం నాలుగు వాహనాలు ఉండగా... వాహనాలు కుదించడంతో ఇక కాన్వాయ్‌లో రెండు వాహనాలు ఉండనున్నాయి. దీన్ని నేటి నుంచే అమలు చేయాలని నిర్ణయించారు.

# కలెక్టరేట్‌లో అర్జీలు నేలపాలు..?



- ఫార్వర్డ్ పేరుతో కాలయాపన..!
- కలెక్టర్ ఉన్నారా..?లేదా..?అని నిలదీస్తున్న ప్రజలు..!
- ఎస్సీ,ఎస్టీ కమిషన్లు రంగంలోకి దిగే వరకు కదలని యంత్రాంగం..?
- మార్కాపురం జిల్లాలో పాలన గాడి తప్పిందా..?

**మార్కాపురం జిల్లా బ్యూరో : సాక్ష్యం** ఫార్వర్డ్ చేశాం..వెళ్లండి..!కలెక్టరేట్‌లో అర్జీ ఇస్తే అధికారులు చెప్పే ఒకే ఒక్క మాట ఇది.ఆ ఫార్వర్డ్ ఎక్కడికి వెళ్తోందో,సమస్య తీరుతోందో లేదో పట్టించుకునే నాథుడే లేడు.జిల్లాలో ప్రజా సమస్యలు పేరుకుపోతున్నా,కలెక్టర్ కార్యాలయం మాత్రం "ఫార్వర్డ్ ఫ్యాక్టరీ"గా మారిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**కమిషన్లు వస్తేనే కదలిక - అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట..!**

"దళితుడు చచ్చినా చావే " అంటూ సాక్ష్యం దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి జవహర్ స్వయంగా అమానిగుడిపాడు దళితవాడకు వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సి వచ్చింది.మరి మన కలెక్టర్ ఏం చేస్తున్నారు..? ఆ ఘటన నేపథ్యంలోనే ఈనెల 19న ఎర్రగొండపాలెం తహసీల్దార్,ఆర్డీవో,జిల్లా కలెక్టర్‌లను నేరుగా కమిషన్ కార్యాలయానికి రావాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం.జిల్లా కలెక్టర్‌ను కమిషన్ పిలిపించే స్థాయికి పరిస్థితి దిగజారడం సిగ్గుచేటు కాదా..?

**గిరిజనుల గోడు నెలలు గడిచినా సమాధానం శూన్యం..!**

ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రగొండపాలెంలోని గిరిజన గూడేలు సందర్శించినప్పుడు గిరిజనులు తాగునీటి కష్టాలు, పక్కా గృహాల లేమి గురించి మొరపెట్టుకున్నారు. వెంటనే సంబంధిత శాఖల అధికారులకు,జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఫార్వర్డ్ చేసి నివేదించినా, ఈనాటికీ అటు నుంచి " ఊ " అన్న సమాధానం లేదు.అర్జీలు ఫార్వర్డ్ చేస్తే సరిపోతుందా..? పరిష్కరించేది ఎవరు..?

**"కలెక్టర్ ఉన్నారా..? లేదా..? సామాజిక మేధావుల ఆగ్రహం..?**

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో పాలన పట్టాలు తప్పిందని,అర్జీలను సత్వరమే పరిష్కరించడంలో కలెక్టర్ పూర్తిగా విఫలమయ్యారని సామాజిక మేధావులు మండిపడుతున్నారు." రాష్ట్ర కమిషన్లు జోక్యం చేసుకునే వరకు కదలని అధికార యంత్రాంగాన్ని చూసి,' అసలు ఈ జిల్లాలో కలెక్టర్ పనిచేస్తున్నారా..? లేదా..? అన్న విమర్శలను ఎదుర్కోవడం సిగ్గుచేటు " అని వారు వాపోతున్నారు.

**అసలు కలెక్టర్ తలుచుకుంటే..?**

ఒక్క కలెక్టర్ గనుక మనసు పెట్టి, ప్రతి సోమవారం జరిగే " మీకోసం " కార్యక్రమంలో వచ్చే అర్జీలను ట్రాక్ చేసి,సంబంధిత అధికారులతో వారానికోసారి రివ్యూ పెడితే, ఈ సమస్యలన్నీ ఇట్టే పరిష్కారం కావా..? పబ్లిక్ డ్యాష్‌బోర్డ్ లో ఏ అర్జీ ఏ స్థాయిలో ఉందో ప్రజలు చూసేలా వెబ్‌సైట్‌లో పెడితే అధికారులకు బాధ్యత పెరగదా..?టైమ్ బౌండ్ పరిష్కారంతో ప్రతి అర్జీకి 30 రోజుల గడువు విధించి,పరిష్కరించని అధికారి పై చర్యలు తీసుకుంటే ఫార్వర్డ్ పంచాయతీ ఉంటుందా..?ఫీల్డ్ విజిట్ ఏసీ గదుల్లో కూర్చోకుండా కలెక్టర్ స్వయంగా నెలకోసారి ఒక్కో మండలంలో పర్యటిస్తే,అమానిగుడిపాడు,గిరిజన గూడేల బాధలు ఆయన కళ్లకు కనిపించవా..? కలెక్టర్ స్థాయి అధికారి తలుచుకుంటే,ఇచ్ఛ ఉంటే,ఒకే ఒక్క సంతకంతో వందల అర్జీలకు మోక్షం లభిస్తుంది.కావాల్సింది " ఫార్వర్డ్ " చేసే చేతులు కాదు," పరిష్కారం " చూపే గుండె.మార్కాపురం జిల్లా ప్రజలు కోరుకుంటున్నది అదే.మరి కలెక్టర్ స్పందిస్తారా..? వేచి చూడాలి..?

# బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

– బీవీఎం రాష్ట్ర అధ్యక్షుడు భూంపల్లి రవితేజ డిమాండ్




**సికింద్రాబాద్, మే 14 (సాక్ష్యం) :** మైనర్ బాలికపై జరిగిన దాడి ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సాయి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని బీవీఎం రాష్ట్ర అధ్యక్షుడు భూంపల్లి రవితేజ డిమాండ్ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహించిన సమావేశంలో బీవీఎం రాష్ట్ర నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 8న పదో తరగతి చదువుతున్న 17 ఏళ్ల మైనర్ బాలికకు మద్యం తాగించి లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఘటన జరిగిన రోజే బాధిత కుటుంబ సభ్యులు మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా, ఈ కేసులో పెద్ద నాయకుల పేర్లు ఉన్నాయని చెబుతూ పోలీసులు ఫిర్యాదు స్వీకరించకుండా గంటల తరబడి వారిని భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. బాధితురాలు న్యాయం కోసం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దురదృష్టకరమని, రాజకీయ ప్రభావంతో కేసును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో కూడా మహీంద్రా విశ్వవిద్యాలయంలో మద్యం మత్తులో ఇతర విద్యార్థులపై దౌర్జన్యంగా ప్రవర్తించిన ఘటనల్లో బండి సాయి భగీరథ్ పేరు వినిపించిందన్నారు. మైనర్ బాలికకు సంబంధించిన ఈ కేసులో కఠిన చట్టాల కింద కేసు నమోదు చేయాల్సి ఉండగా, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తన రాజకీయ ప్రభావంతో తన కుమారుడిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని భూంపల్లి రవితేజ ఆరోపించారు. ఈ ఘటనపై భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు మౌనం వహించడం సిగ్గుచేటని, బాధితురాలికి న్యాయం జరిగే వరకు ప్రజాప్రతినిధులు పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఒక న్యాయం, రాజకీయ నాయకుల కుటుంబాలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. బాధితురాలికి న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీవీఎం నాయకులు మనోజ్, కిషోర్, పాండు, శ్యామ్, రాహుల్, అవినాష్, శ్రీమాన్, వినయ్, నీలేష్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వారోత్సవాలలో పూర్వ విద్యార్థులకు సన్మానం

– డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం






**ఏటూరునాగారం, మే 14, (సాక్ష్యం) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు ప్రభుత్వ డిగ్రీ గురువారం '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను అనుసరించి ఏడు రోజుల విద్యా వారోత్సవాల కార్యక్రమం లో భాగంగా నాలుగవ రోజున కళాశాలలో పూర్వ విద్యార్థులతో అల్యూమిని అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అల్యూమిని సభ్యులైన పి. శ్రీకాంత్, భాస్కర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొని కళాశాలతో వారికీ ఉన్న అనుబంధాన్ని గురించి మాట్లాడారు. అలాగే కళాశాల అభివృద్ధిలో తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఈ కళాశాలలో చదువుకొని ఈ కళాశాలలోనే అధ్యాపకులుగా కొనసాగుతున్న భాస్కర్, శ్రీకాంతులను కళాశాల అధ్యాపకులు శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అల్యూమిని ఉపాధ్యక్షుడు సిహెచ్ వెంకటయ్య, కనీస్ ఫాతిమా, రమేష్, శ్రీధర్ మరియు బోధనేతర సిబ్బంది శ్రీనివాస్, సురేష్, లక్ష్మి తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నది పంట కొనుగోలులో జాప్యం చేస్తుంది

– దేవరకొండ మాజీ శాసనసభ్యులు, బిఆర్‌యస్ జిల్లా నాయకులు రమావత్ రవీంద్ర కుమార్





**డిండి. సాక్షం న్యూస్ :** నిబంధనల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బంది పెడుతుందని, ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనే దిక్కులేక రైతులు అవేదన చెందుతున్నారని దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆయన గురువారం డిండి మండల పరిధిలోని తవక్లపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంను సందర్శించి రైతుల బాధలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు అప్పులు తెచ్చికష్టపడి పంట పండిస్తే కొనే దిక్కులేక పోయార ని అన్నారు. కనీసం గన్ని బ్యాగులు ఇచ్చే పరిస్తితిలో ప్రభుత్వం లేదు అని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నపుడు ఎప్పుడూ వడ్ల కొనుగోలులో ఇంత ఆలస్యం కాలేదని, రైతులకు ఇంత బాధ రాలేదని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం రైతుల నుండి తరుగు పేరిట 2 కేజిల వడ్లు కట్ చేస్తున్నారని వెంటనే ఆపాలని కోరారు. మిల్లర్లు 3కేజీలు కట్ చేస్తున్నారని ఆయన తెలిపారు. అధికారులు ఏం చేస్తున్నారు...?కొనుగోలు కేంద్రాల్లో తిరగాలని సూచించారు. ఈ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుంది అని అన్నారు. పాలన చేతకాకుంటే దిగిపోవాలి అని కోరారు.ఎన్నికల ముందు ఇచ్చిన 7 గ్యారంటీలు,420హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణమే ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర్ రావు,పి ఎ సి యస్ చైర్మన్ మాధవరం శ్రీనివాస్ రావు, ఎర్రగుంటపల్లి గ్రామ సర్పంచ్ మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, రవీందర్ రావు, గొడుగు వెంకటయ్య, గిరమోని శ్రీను,రమావత్ తులిసీరామ్, జంగయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

## ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

– ప్రచారానికి వస్తే సీతక్కను నిలదీయండి
– జాడి రామరాజు నేత



**ఏటూరునాగారం, మే 14, (సాక్ష్యం) :** ఏటూరునాగారం మండల కేంద్రం లో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా,, జాడి రామరాజు నేత గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పక్షంలో ఉండగా సీతక్క ఇచ్చిన హామీలు అధికారం వచ్చాక ఒక్కటైనా నెరవేర్చిన చరిత్ర లేదని మండిపడ్డారు. అంతేకాకుండా మంత్రి సీతక్క కన్నాయిగూడెం మండలం లో పర్యటన చెయ్యటానికి కారణం ఏమిటన్నారు. అధికారం లోకి వచ్చి 2 సంత్సరాల 6 నెలలు మంత్రి గా పదవి భాద్యతలు పూర్తి చేసుకున్నా మంత్రి కంతనపల్లి చెరువు, రోడ్డు అభివృద్ధికై పిడికెడు మట్టి పోసిందిలేదని అన్నారు. రానున్న జడ్పీటీసీ ఎన్నికల్లో తన కోడలును జడ్పీ చైర్మన్ చెయ్యడం కోసం ప్రజాపాలన పేరుతో ప్రజలను నమ్మించి మరో సారి మోసం చెయ్యడానికి వస్తున్నారన్నారు. ఐలపురం కు రోడ్ ఏమైందని దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ నుండి నీళ్లు ఎక్కడి రైతులకు ఇస్తున్నారో ఈ ప్రాంత ప్రజలకు చెప్పిన తర్వాత పర్యటన చేస్తే బాగుండేదన్నారు. అదే విదంగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోని రాష్ట్ర మంత్రులు కాంగ్రెస్ నాయకులు అవినీతి అక్రమాలు చేస్తూ జల్సాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కన్నాయిగూడెం మండలం కు ఇచ్చిన నిధులు ఏమిటో చెప్పాలన్నారు. నాడు ఎమ్మెల్యే గా ఉండగా దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ నుండి మండలం లోని రైతులకు సాగు నీరు త్రాగునీరు ఇస్తామని చెప్పిన నాయకురాలు గా నీళ్లు ఇచ్చారా అన్నారు. ఇచ్చిన మాట మీద నిలబడని అధికారం లోకి రాగానే నీళ్లు ఇస్తానని చెప్పిన మంత్రి సీతక్క ఒక్క ఇంచు భూమికైనా నీళ్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. కన్నాయిగూడెం మండలం పర్యటన చేయడం మంచిదే కానీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కోడలును జడ్పీచైర్మన్ పదవి కట్టబెట్టడం కోసం ఈ ప్రాంత ప్రజలను నమ్మించడానికి వస్తున్న మంత్రిని మేధావులు, ఏజెన్సీ ప్రాంత ప్రజలు నిలదీయాలని రామరాజు నేత అన్నారు.

## శ్రీ సీతారామచంద్రస్వామికి వెండి పూలమాలను బహుకరించిన బోడ వినీషా: మహేష్ దంపతులు



**ఖానాపురం మే14 (సాక్ష్యం న్యూస్ ) :** ఖానాపురం మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలోని రామచంద్ర స్వామికి బోడ వినీషా -మహేష్ దంపతులు 240 గ్రాముల వెండి పూలమాలను బహుకరించారు. ఖానాపురం మండల కేంద్రానికి చెందిన విద్యుత్ సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ నాగయ్య- శారద దంపతుల కుమార్తె బోడ వినీషా- మహేష్ దంపతులు 240 గ్రాముల వెండి పూలమాలను ఖానాపురం సర్పంచ్ దాసరి రమేష్ ఆలయ చైర్మన్ గొల్లపూడి సుబ్బారావు సమక్షంలో ఆలయ అర్చకులు నితీష్ శాస్త్రి వేదమంత్రాల నడుమ అందజేశారు.ఈకార్యక్రమంలో వడ్డె రాజశేఖర్, మచ్చిక శ్రీకాంత్, కామిశెట్టి సుధీర్, భూషణబోయిన శ్రావణ్, రాగం సతీష్, భూషణ బోయిన నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాచారంలలో పోలీసుల అవగాహన కార్యక్రమం



**సికింద్రాబాద్, మే 14 ( సాక్ష్యం) :** ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు నాచారం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం సాయంత్రం అన్నపూర్ణ కాలనీ, మల్లాపూర్, దుర్గానగర్ ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలకు పలు ముఖ్యాంశాలపై అవగాహన కల్పించారు. ఇంటి పనివారు, వాచ్‌మెన్‌లు, కేర్ టేకర్ల ధృవీకరణ అవసరం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాల నివారణ వంటి అంశాలపై పోలీసులు వివరించారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు, ఫోన్ కాల్స్, ఓటీపీ వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని ప్రజలకు సూచించారు. మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ అందుబాటులో ఉందని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నాచారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ధనుంజయ్, ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐ మైబెల్లీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చెక్ పోస్టుల తనిఖీ చేసిన ఏ సీపీ శశాంక్ రెడ్డి




**సికింద్రాబాద్, మే 14( సాక్ష్యం):** బక్రీద్ సమీపి స్తున్న వేళ లాలాగూడ పోలీస్టేషన్ పరిధి లోని మిర్జాలగూడ, ఇసుక బావి చెక్ పోస్టు లను చిలకలగూడ ఏసీపీ కె.శశాంక్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ శశాంక్ రెడ్డి మాట్లాడుతూ.. తనిఖీల సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అక్రమంగా పశువులను రవాణా చేసినా, పశువైద్యుల ధృవపత్రం లేకుండా తరలించినా సంబంధిత వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాపై ఎవరికి సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అయితే, ప్రజలు స్వయంగా వెళ్లి వాహనాలను అడ్డుకోవడం, డ్రైవర్లపై దాడులకు పాల్పడడం వంటి చర్యలు చేయరాదని స్పష్టం చేశారు. అలాంటి ఘటనలకు పాల్పడిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## ఓయూ సిటీ ట్రాఫిక్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు







**సికింద్రాబాద్, మే 14 ( సాక్ష్యం ):** రోడ్డు భద్రతా నిబంధనల అమలులో భాగంగా ఓయూ సిటీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఆకస్మిక లైటింగ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్రత్యేక తనిఖీలను డీసీపీ ట్రాఫిక్-1 అవినాష్ కుమార్, ఏసీపీ ట్రాఫిక్-2 ఏ. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఓయూ సిటీ ట్రాఫిక్ పోలీసులు చేపట్టారు. డ్రైవ్ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఇందులో మూడు ద్విచక్ర వాహనాలు, ఒక నాలుగు చక్రాల వాహనం, ఒక ఆరు చక్రాల వాహనంపై మొత్తం ఐదు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడంతో పాటు రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఓయూ సిటీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## వరి కోతల అనంతరం కోయలను పొలాల్లో కాల్చవద్దు

– మండల వ్వవస్యాధికారి రహేన



**డిండి. సాక్షం న్యూస్:** వరి కోతల అనంత్రం పొలం లో కోయాలను కాల్చరాదని ఇలా చేయడం వలన భూసారం దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి పెద్ద హానికరమని, ప్రజారోగ్యానికి కూడా ప్రమాదమని వ్యవసాయ శాఖ హెచ్చరిస్తోందిని మండల వేవసాయధికారి రహేన అన్నారు. ఆమె ఈ సందర్భశీగా మాట్లాడుతూ, పొలంలో వరి కోయలను కాల్చితే నేలలోని సేంద్రీయ పదార్థాలు, పోషకాలు నశిస్తాయ ని, నేలలో ఉండే వానపాములు, సూక్ష్మజీవులు చనిపోతాయని,వాయు కాలుష్యం పెరిగి, కార్బన్ ఉద్గారాలు వాతావరణ మార్పులకు దారితీస్తాయన్నారు. వెలువడే పొగ వల్ల శ్వాస సమస్యలు, దగ్గు, కంటి మండడం, ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉ ందన్నారు. అంతేకాకుండా పొలంలో గాలి ప్రసరణ, నీటి చొరబాటు తగ్గి తదుపరి పంట దిగుబడి పడిపోతుందని,భూమి గట్టిపడి నీరు నిల్వ సామర్థ్యం తగ్గి, చేదుగా మారుతుందన్నారు. కోతల తర్వాత వరి కోయలను కాల్చకుండా పొలంలోనే ఉంచాలని వ్యవసాయ శాఖ సూచించింది. స్ట్రా చాపర్ లేదా శ్రెడర్ యంత్రంతో అవశేషాలను చిన్న ముక్కలుగా చేయాలని, పొలంలో నీరు పెట్టి ట్రాక్టర్ రోటావేటర్‌తో 25 రోజుల్లో, తద్వారా వరి నాణ్యత మెరుగవుతుందన్నారు. ఈ కార్యక్రమం లో రైతులు తదితరులు పాలుగోన్నారు.

## ప్రజలకు నాణ్యమైన తక్షణ వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంది

– భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు



(సాక్ష్యం) న్యూస్ జయశంకర్ – భూపాలపల్లి, మే 14 : ప్రజలకు నాణ్యమైన తక్షణ వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యూబ్ డయాగ్నస్టిక్ డివైసెస్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలకు త్వరితగతిన వైద్య పరీక్షలు మిర్వహణకు 50 హెల్త్ క్యూబ్ డయాగ్నస్టిక్ డివైసెస్ కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కిట్ల ద్వారా 16 రకాల వైద్య పరీక్షలు నిర్వహించవచ్చని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తక్షణ రోగ నిర్ధారణ పరీక్షలు చేసి సమయానికి చికిత్స అందించడానికి ఈ పరికరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీడీఎల్ పరిశ్రమ సిఎస్ఆర్ నిధుల ద్వారా ఈ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సిఎస్ఆర్ నిధులతో ప్రధాన ఆసుపత్రిలో వెంటిలేటర్లు, ఎంఆర్ఐ, సిటీ స్కాన్, సాంకేతిక నిపుణులు ఏర్పాటు వంటి ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం 203 పోస్టులను మంజూరు చేయించగా, రూ.14 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పల్లె దవాఖానాల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువవుతాయని, అసంపూర్తి భవనాలను త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. సిఎస్ఆర్, డిఎంఎఫ్‌టిఎస్‌డిఎఫ్ నిధులను వైద్య రంగ అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలు దారుణం: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్, మే 14 ( సాక్ష్యం బ్యూరో ) : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకం, నాణ్యత పరీక్షలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా వరి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం వరి ధాన్యం కొనుగోలులో తీవ్ర ఆలస్యం జరుగుతోందని విమర్శించారు. తేమ శాతం (మాయిశ్చర్) పేరుతో రైతులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, తరుగు పేరుతో ధాన్యాన్ని అధిక మొత్తంలో కోత విధిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం అమ్మిన తర్వాత రైతులకు చెల్లింపులు సమయానికి జరగడం లేదని, చెల్లింపుల ఆలస్యంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొంతమంది రైతులు పంటను కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి ఉంచినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. వర్షాలు పడితే ధాన్యం తడిసి రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచాలని, కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయమైన ధర కల్పించి, సమయానికి చెల్లింపులు చేయాలని కోరారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## ఆలయంలో నిత్యారాధనలు





యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్ యాదగిరి పుణ్యక్షేత్రంలో గురువారం పంచనారసింహులను ఆరాధిస్తూ చేపట్టిన నిత్య పూజలు ఆలయ ఆచారంగా కొనసాగాయి. వేకువ జామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయ ద్వారాలను తెరచి మూలవరులను హారతినిచ్చి కొలిచారు. పాలతో నిజాభిషేకం నిర్వహించాక, తులసి పత్రాలతో అర్చన చేపట్టారు. మహా ముఖమండపంలో అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన క్రతువులు కొనసాగించారు. ఉగ్ర నరహరిని శాంతింప జేసేందుకు శ్రీ సుదర్శన నా రసింహ హోమం నిర్వహించారు. లోక కళ్యాణార్థమై శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్య కళ్యాణం ఆలయ ఆచారంగా చేపట్టారు. గజవాహనంపై సేవా పర్వాన్ని నిర్వహించారు. సాయంత్రం అలంకార జోడు సేవలు మంగళ వాయిద్యాలు, మంత్ర పటణాలతో మాడవీధులలో ఊరేగించారు. రాత్రి గర్భాలయంలోని స్వయంభూలను కొలుస్తూ ప్రత్యేక ఆరాధన జరిపారు. దర్బారు సేవోత్సవంలో నిత్య ఆదాయం వెల్లడించారు.

## ఘనంగా పిడమర్తి రవి జన్మదిన వేడుకలు



మాడుగులపల్లి మే 14 సాక్ష్యం; తెలంగాణ ఉద్యమకారుడు మాజీ తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డా పిడమర్తి రవి జన్మదిన వేడుకలు గురువారం మాడుగులపల్లి మండల కేంద్రం లో తెలంగాణ బహుజన రాష్ట సమితి జిల్లా ఇంచార్జి పుల్లెశీల సతీష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతు తెలంగాణ ఉద్యమం లో క్రియ శీలకంగా పాల్గొన్నారు అని వందల పైగా కేసు లు వంద రోజుల పైగా జైలు జీవితం గడిపారు అని అన్నారు.తెలంగాణ రాష్ట ఏర్పాటు లో ప్రముఖ పాత్ర పోషించిన డా పిడమర్తి రవి కి తగిన పదవి ఇవ్వక పోవడం బాధకరం అని అన్నారు.ఇప్పటి కి అయినా గుర్తుంచి తగిన ప్రధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రక్త దాత వేణు ఊర,దర్శనం చిట్టి బాబు,మేడి రాజు,నవీన్ గౌడ్, ప్రేమ్ కుమార్,శ్రవణ్ యాదవ్, సుమన్ ,తదితరులు పాల్గొన్నారు.

## దత్తాయపల్లి గ్రామంలో బడిబాట





తుర్కపల్లి సాక్ష్యం న్యూస్ తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి లో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా జయశంకర్ బడి బాట కార్యక్రమం లో పాల్గొనటం జరిగింది. ప్రభుత్వ బడులను కాపాడుకోవాలి. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలి అని మాట్లాడటం జరిగింది. గ్రామంలో పిల్లలను ప్రవేటు బడికి పంపిస్తున్న తల్లిదండ్రులను కలిసి స్థానికి ప్రభుత్వ బడిలొ చెర్పించగలరని మాట్లాడటం జరిగింది. ఫలితాలు, ఆటలు, పాటలు, సంస్కృతిక కార్యక్రమాలు చేయు అన్ని ఆక్టివిటీస్ గురించి తెలుపటం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం, ఏ ఏ పీ సి చైర్మన్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలను చుట్టాలుగా మార్చుకుంటున్న పాలకులు

– హనుమకొండ రాజకీయ శిక్షణ తరగతులలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు






హనుమకొండ 13 మే (సాక్ష్యం) చట్టాలను పాలకులు చుట్టాలుగా మార్చుకుంటూ పేదలపై ప్రతాపం చూపుతున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో హనుమకొండ మండల శాఖ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ శిబిరం గురువారం ప్రారంభం అయింది. మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు తప్పు చేస్తే ఎన్ కౌంటర్ లు చేసే ప్రభుత్వాలు పెద్దలకు మాత్రం నోటీసులతో సరి పెడుతున్నారని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ విషయములో ఇదే జరుగుతున్నదని అన్నారు. ఆ కేసు విషయములో సిట్ వేయడమే ఇందుకు నిదర్శనం అని, అదే సామాన్యుడి విషయములో ఇది జరుగుతుందా అని ప్రశ్నించారు. బండి భగీరథ్ ను రాష్ట్ర ప్రభుత్వం కాపాడే ప్రయత్నం చేస్తున్నదని, ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. బండి భగీరథ్ పై తక్షణమే విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్ అని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నానని గొప్పలు చెప్పుకున్న ప్రధాని మోడీ, నేడు ప్రజలకు బంగారం కొనొద్దు, పెట్రోల్ డీజిల్ వాడకం తక్కువ చేయాలి, విదేశీ ప్రయాణాలు తగ్గించాలనే నీతి సూక్తులు వల్లే వేస్తు, తమ 12 సంవత్సరాల పాలన వైఫల్యాలను, దివాళ కోరు విధానాలను కప్పిపుచ్చుకోవడానికి నాటకాలు మొదలుపెట్టాడని తీవ్రంగా విమర్శించారు. ఆర్థిక సంక్షోభం నెలకొన్నప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయకుండా కోటీశ్వరులపై రెండు నుంచి ఐదు శాతం పన్నులు వేయాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నా పట్టించుకోకుండా కార్పొరేట్లతో కుమ్మక్కై ఆర్థిక వ్యవస్థను దిగజార్చుతూ డీజిల్, పెట్రోల్ ఇతర వస్తువుల ధరలు భారీగా పెంచడానికి కుయుక్తులు పన్నుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుయుక్తులను తిప్పి కొట్టాలని ఆయన పిలుపు నిచ్చారు. అనునిత్యం పేదల కోసం పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టు పార్టీని ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. ఈ శిక్షణా తరగతులలో హనుమకొండ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ప్రొఫెసర్ మార్క శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక కేంద్రాల అభివృద్ధికి ప్రాధాన్యత

– ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్‌నగర్, మే 14 ( సాక్ష్యం బ్యూరో ) : మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ నగరంలోని పిల్లలమర్రిలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించబడినట్లు వెల్లడించారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా సుమారు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయగా, అందులో భాగంగా ఈరోజు రూ.2.5 కోట్ల వ్యయంతో పలు పనులకు శంకుస్థాపన నిర్వహించినట్లు తెలిపారు. మయూరి పార్క్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా ట్రెక్కింగ్ ట్రైల్స్, వ్యూ పాయింట్లు, పర్యాటకుల కోసం తాత్కాలిక కాటేజీల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఫారెస్ట్ ఏరియా పరిమితులను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు జరుగుతాయని చెప్పారు. అలాగే కురుమూర్తి, మన్నెంకొండ, పిల్లలమర్రి వంటి ముఖ్య ఆధ్యాత్మిక కేంద్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని అన్నారు. వచ్చే సంవత్సరం నిర్వహించనున్న కృష్ణ పుష్కరాల దృష్ట్యా జిల్లాలోని పురాతన దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సుమారు 150 పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రికి సమర్పించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి కూడా వాటిని ఆమోదిస్తూ జిల్లాలోని ప్రధాన దేవాలయాలన్నింటినీ అభివృద్ధి చేయాలని సూచించినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా కార్యరూపంలో పనిచేస్తోందని, గతంలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దుతూ వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో సమగ్ర అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మేయర్ గుమ్మాల మమత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు దేప్లీ మేఘ్యానాయక్, ప్రశాంత్, రమేష్ రెడ్డి, తిరుమల వెంకటేష్, నాయకులు వర్ధ రవి, అశ్వాక్, హకీం, కాటం రాజు, జిల్లా పర్యాటక అధికారి జె. రాజశేఖర్ రెడ్డి, టీఎస్‌టీసీ డీ.ఈ పర్షవేది తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



జడ్చర్ల/మహబూబ్‌నగర్, మే 14 ( సాక్ష్యం బ్యూరో ) : జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం జడ్చర్ల మండలంలోని పత్తి మార్కెట్ యార్డును సందర్శించిన కలెక్టర్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. మార్కెట్ యార్డులో కలియ తిరిగి లోడింగ్, అన్‌లోడింగ్, స్టోరేజీ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్, మార్క్‌ఫెడ్, సహకార శాఖ అధికారులతో పాటు రైతులతో మాట్లాడి ఇప్పటివరకు ఎన్ని బస్తాలు కొనుగోలు చేశారో, ఇంకా ఎన్ని బస్తాలు కొనుగోలు చేయాల్సి ఉందో అడిగి తెలుసుకున్నారు. అధికారులు సుమారు 40 వేల బస్తాలు కొనుగోలు చేసి మార్కెట్ యార్డులో తాత్కాలికంగా నిల్వ చేసినట్లు తెలిపారు. మరో 30 వేల బస్తాలు కొనుగోలు చేయాల్సి ఉందని, వీటికి సీరియల్ నంబర్ ప్రకారం టోకెన్లు జారీ చేశామని, రెండు రోజుల్లో కొనుగోలు పూర్తి చేస్తామని కలెక్టర్‌కు వివరించారు. లోడింగ్, అన్‌లోడింగ్ త్వరగా పూర్తి చేయడానికి అదనపు హమాలీలను నియమించినట్లు అధికారులు తెలిపారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి ధాన్యాన్ని మహబూబ్‌నగర్ పట్టణంలోని మార్క్‌ఫెడ్ అధికారులు గుర్తించిన గోదాములకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. పీఏసీఎస్ అధ్యక్షులు కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తూ గోదాములకు వేగంగా రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడడంతో పాటు, చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా సరఫరా చేయాలని, అకాల వర్షాల నుంచి రైతుల ధాన్యాన్ని రక్షించేందుకు టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మార్కెట్ యార్డులో ఎక్కువకాలం నిల్వ ఉంచవద్దని స్పష్టం చేశారు. రవాణా కోసం తగిన సంఖ్యలో లారీలు, ట్రక్కులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉదయం రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ కూడా పత్తి మార్కెట్ యార్డును సందర్శించి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, మార్క్‌ఫెడ్ డీఎం తహమీన, మార్కెట్ కార్యదర్శి సిరాజుద్దీన్, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వేణుగోపాల్, జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్య

– అదనపు కలెక్టర్ సంధ్యారాణి





వరంగల్,14 మే (సాక్ష్యం) ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక"లో భాగంగా గురువారం కృష్ణాకాలనీ ప్రభుత్వ జూ.కళాశాల పాఠశాలలో జరిగిన "పేరెంట్స్ మీటింగ్ మరియు పూర్వ విద్యార్థుల అనుభవాలు" అనే కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాల పాఠశాలకు చెందిన తల్లిదండ్రులు వారి అనుభవాలను వివరించారు. పాఠశాల కళాశాలలోని విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో మార్కులు సాధించడం చాలా గర్వకారణంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రైవేట్ విద్యా సంస్థల్లో చేర్పించి లక్షల రూపాయలు నష్టపోకూడదని అన్నారు. వచ్చే విద్యా సం.లో రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తో పాటు అల్పాహారం, వెల్ కం కిట్ (పుస్తకాలు, నోట్స్, బ్యాగ్, టై, బెల్ట్ తదితర అన్ని సామాగ్రి) అందించనుందని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన ఉంటుందని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఐఈఓ డా.శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ విద్యార్థులకు తగు సదుపాయాలు కల్పిస్తే భవిష్యత్తులో అడ్మీషన్లు పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంఛార్జ్ ప్రిన్సిపాల్ శ్రీవినాస్ శర్మ, అధ్యాపకులు రమణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బండి భగీరథ వెంటనే అరెస్ట్ చేయాలి

– బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలి

– సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్




**భూపాలపల్లి (సాక్ష్యం) న్యూస్ 14 మే** రావి నారాయణరెడ్డి భవన్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు. ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై పోక్సో చట్టం కింద కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు పోలీసులు అరెస్ట్ చేయకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోందని అన్నారు. సాధారణ ప్రజల విషయంలో వేగంగా స్పందించే పోలీస్ వ్యవస్థ, అధికార పార్టీ నాయకుల కుటుంబ సభ్యుల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. రాజ్యాంగం ప్రకారం చట్టం అందరికీ సమానమని, అధికారంలో ఉన్నవారికోసం ప్రత్యేక నిబంధనలు ఉండవని తెలిపారు. బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై మరియు పోలీస్ శాఖపై ఉందన్నారు. పోక్సో వంటి తీవ్రమైన కేసుల్లో ఆలస్యం చేయడం వల్ల ప్రజల్లో చట్టంపై నమ్మకం తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా మహిళలు, బాలికల రక్షణ విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి విడనాడాలని, వెంటనే బండి భగీరథను అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు విషయంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా పారదర్శకంగా విచారణ జరపాలని కోరారు. సిపిఐ పార్టీ ఎప్పటికీ బాధితుల పక్షాన నిలబడుతుందని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ప్రవీణ్ తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ నాయకులు నేరెళ్ల జోసెఫ్, పోచంపల్లి మహేష్,గోలి లావణ్య, ఎండి సాబీర్,

# బాటసారుల దాహార్తిని తీర్చడమే లక్ష్యం

– సర్పంచ్ ప్రసన్న రాబర్ట్



**మాడుగులపల్లి, మే 14 సాక్ష్యం;** మాడుగులపల్లి మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలు, బాటసారుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ ప్రసన్న రాబర్ట్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి కాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షకీరా బేగం,గ్రామ పెద్దలు,యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తిరుమలాయపాలెం మండల

# కేంద్రంలో విఓఏల వినూత్న నిరసన

– అంబేద్కర్ విగ్రహానికి ముందస్తు సమ్మె నోటీసు అందజేసిన వివోఏల జేఏసీ

– వివోఏ జేఏసీ మండల జిల్లా అధ్యక్షురాలు సుశీల



**సాక్ష్యం మే 14 పాలేరు** గత గ్రామాలలో నిరంతరం ప్రజలను చైతన్య పరుస్తూ ఎంతో ప్రాయాసపడి భారాన్ని కుటుంబ భారాన్ని మోస్తూ తక్కువ జీతాలతో ఎక్కువ ఫలితాన్ని ప్రభుత్వానికి అందిస్తున్న మమ్ములను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని కనీస ఉద్యోగస్తులుగా కూడా గుర్తింపు ఇవ్వడం లేదని వివోఏల జేఏసీ ఆధ్వర్యంలో విఓఏ లు వినూత్న నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి ముందస్తు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వివో ఎలా జేఏసీ అధ్యక్షురాలు సుశీల మాట్లాడుతూ ఈ నెల 6వ తారీకు నుంచి 18వ తారీకు వరకు తమ అమూల్యమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. 18వ తారీకు లోపు సమస్యలు పరిష్కరించని పక్షంలో 18వ తారీకు నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. వివోఏలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పెండింగ్ బకాయిల చెల్లింపు, పని భారం తగ్గింపు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వివో ఏ ల జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల మండల కార్యదర్శి గుగ్గిళ్ళ ఉమా పోలిశెట్టి అరుణ నూకల వసంత సామినేని కరుణ మేకల కృష్ణవేణి మెట్టు స్వరూప రాణి గోపోజి ఉపేంద్ర పద్మ రాములమ్మ గుగ్గిళ్ళ విజయ నాగమణి కళ్యాణి సువర్ణ నీరుడు లలిత జయ పద్మ మండలంలోని వివోఏలు, జేఏసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డీసీఎం వాహనం ఢీకొని ఇద్దరు మృతి





**మిర్యాలగూడ డివిజన్ మే 14 (సాక్ష్యం న్యూస్)** నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిధిలోని కిష్టాపురం గ్రామ శివారులో ఉదయం దామరచర్ల మండలం సాత్ తండా గ్రామానికి చెందిన మాలోతు సుజాత భర్త రామారావు వయస్సు 40 సంవత్సరాలు మరియు ఆమె కుమారుడు మాలోతు చంటి తండ్రి రామారావు వయస్సు 23 సంవత్సరాలు అనువారాలు మాలోతు సుజాతకు కంటి పరీక్షల నిమిత్తం మిర్యాలగూడ కి వారి యొక్క హీరో హోండా స్ప్లెండర్ ప్లస్ మోటార్ సైకిల్ పై వచ్చి కంటి పరీక్షలు అనంతరం తిరిగి వారి గ్రామానికి వెళ్లడం కోసం అదే మోటార్ సైకిల్ పై వెళుతుండగా మార్గ మధ్యలో మిర్యాలగూడ మండలం కిష్టపురం గ్రామ శివారులోని అన్నపూర్ణ రైస్ మిల్లు వద్దకు మధ్యాహ్నం 12.15 గంటలకు వెళ్లేసరికి ( నార్కెట్ పల్లి అద్దంకి హైవే) పై మిర్యాలగూడ వైపు నుండి దామరచర్ల వైపుకు వెళుతున్న ు+ 09 3075 డీసీఎం యొక్క డ్రైవరు తన డీసీఎంను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి మోటార్ సైకిల్ పై వెళ్తున్న సుజాత మరియు చంటిలను వెనక నుండి టక్కరూ ఇవ్వగా ఇద్దరు మోటార్ సైకిల్ తో పాటు రోడ్డుపై పడిపోగా వారి మీద నుండి డీసీఎం వాహనం వెళ్లిపోగా మాలోతు సుజాత పొట్ట నుండి శరీర భాగాలు బయటికి వచ్చేసి అక్కడికక్కడే చనిపోయినది మరియు మాలోతు చంటి కి తలకు చాతి పైన ఇతర శరీర భాగాలపైన బలమైన రక్త గాయాలు కాగా వెంటనే అంబులెన్సులో చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేపిస్తుండగా మధ్యాహ్నం 1.45 గంటలకు చనిపోయినాడు అని మాలోతు రామారావు తండ్రి రాంజీ ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ పోలీసు వారు తెలిపారు.

# డీజీపీని మర్యాదపూర్వకంగా కలసిన వరంగల్ సీపీ




**హనుమకొండ 14 మే (సాక్ష్యం)** తెలంగాణ రాష్ట్ర డీజీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సివి ఆనంద్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ డీజీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలియజేసారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పనితీరు సంబందించిన వివరాలను డీజీపీ వరంగల్ సీపీని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం నిఘాతో ప్రజలకు సహకరించాలని వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, పోలీస్ సిబ్బంది నిబద్ధతతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సిపికి సూచించారు.

# అధికారులు అంకితభావంతో పనిచేయాలి

– వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్





**హనుమకొండ 14 మే (సాక్ష్యం)** స్టేషన్ అధికారులు అంకితభావంతో పనిచేస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలని వరంగల్ సిపి సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ ఆదేశాల మేరకు హసన్ పర్తి, కాజీపేట పోలీస్ స్టేషన్ల నూతన ఇన్స్ స్పెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన ఇన్స్పెక్టర్లు మహేందర్, శ్యాంసుందర్ గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను సిపి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నిజాయితీతో విధులు నిర్వహిస్తూ, బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, పోలీస్ స్టేషన్లో న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితులకు కలిగించాలని పోలీస్ కమిషనర్ నూతన ఇన్స్ స్పెక్టర్ల కు దిశా నిర్దేశం చేశారు.

# తెలంగాణ ఇంటర్ విద్యలో మార్పులు

ఇక నుంచి ఫస్టియర్‌లోనూ ప్రాక్టికల్స్



**హైదరాబాద్ మే 14 (సాక్ష్యం న్యూస్)** రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ఇంటర్ విద్యలో కీలక మార్పులు తీసుకువచ్చింది. ఇక నుంచి ఇంటర్ ఫస్టియర్‌లోనూ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ కొత్త మార్పులు అమల్లోకి రానున్నట్లు అధికారులు వెల్లడించారు. మ్యాథ్స్ సబ్జెక్టులోనూ థియరీ మార్కులు తగ్గించి.. వాటిని ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా చేర్చనున్నారు. విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకు ఈ మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. ఇంటర్మీడియట్ విద్యలో కీలక మార్పులు తీసుకువస్తూ.. నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు కలిసి ఈ మార్పులకు శ్రీకారం చుట్టాయి. 2026-2027 అకడమిక్ ఇయర్ నుంచే రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యలో ఈ సరికొత్త మార్పులు అమల్లోకి రానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ కొత్త ఇంటర్ విద్యా విధానంలో భాగంగా.. మ్యాథమేటిక్స్ సబ్జెక్టుతోపాటు.. ప్రాక్టికల్స్ పరీక్షల మార్కుల్లో మార్పులు చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో భయం లేకుండా.. వాటిపై మరింత ఆసక్తి పెంచేందుకే ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి. ఇక ఇప్పటివరకు ఇంటర్మీడియట్‌లో కేవలం సెకండ్ ఇయర్‌లో మాత్రమే ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉండేవి. కానీ తాజాగా తీసుకువచ్చిన మార్పుల ప్రకారం.. ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్‌ను నిర్వహించనున్నారు. ఇప్పటిదాకా.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో 30 మార్కుల చొప్పున సెకండియర్‌లో ప్రాక్టికల్స్ ఉండేవి. అయితే వీటిని ఫస్టియర్‌లో 15 మార్కులు, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్‌కు విడగొట్టారు. ఈ నిర్ణయం వల్ల ఫస్టియర్ నుంచే విద్యార్థులకు ప్రాక్టికల్స్‌పై పట్టు ఉంటుందని పేర్కొంటున్నారు. ఇక ఇప్పటివరకు ఇంటర్మీడియట్‌లో కేవలం సెకండ్ ఇయర్‌లో మాత్రమే ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉండేవి. కానీ తాజాగా తీసుకువచ్చిన మార్పుల ప్రకారం.. ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్‌ను నిర్వహించనున్నారు. ఇప్పటిదాకా.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో 30 మార్కుల చొప్పున సెకండియర్‌లో ప్రాక్టికల్స్ ఉండేవి. అయితే వీటిని ఫస్టియర్‌లో 15 మార్కులు, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్‌కు విడగొట్టారు. ఈ నిర్ణయం వల్ల ఫస్టియర్ నుంచే విద్యార్థులకు ప్రాక్టికల్స్‌పై పట్టు ఉంటుందని పేర్కొంటున్నారు. మరోవైపు.. లాంగ్వేజీ పరీక్షల్లో కూడా కీలక మార్పులను ప్రవేశపెట్టారు. ఇంగ్లీష్, తెలుగు లేదా సంస్కృతం సబ్జెక్టులకు కూడా 100 మార్కులకు బదులుగా 80 మార్కులకే పరిమితం చేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. మిగిలిన 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా విద్యార్థులకు వేయనున్నారు. ఇంటర్‌లో విద్యార్థులు బట్టీపట్టే విధానాన్ని తగ్గించి.. వారికి జ్ఞాపకశక్తిని పెంపొందించేలా.. ప్రాక్టికల్స్ స్కిల్స్‌ను పెంచడమే లక్ష్యంగా ఈ కొత్త విద్యావిధానాన్ని తీసుకువచ్చినట్లు ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది.

# రాష్ట్రంలో మరింత పెరగనున్న ఎండలు

45 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు.. పలు జిల్లాలకు రెడ్ అలర్ట్



**హైదరాబాద్ మే 14 (సాక్ష్యం న్యూస్)** తెలంగాణలో రానున్న రోజుల్లో భానుడి ప్రతాపం మరింత పెరగనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తీవ్ర హెచ్చరికలు చేశారు. అత్యధికంగా 45 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు చెప్పారు. దీంతో రాష్ట్రంలోని కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. వడగాల్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. ఉదయం 8 గంటలకే ఇంట్లో నుంచి కాలు బయటపెట్టాలంటేనే జనం జంకుతున్నారు. సాయంత్రం 5 గంటల వరకు భానుడి భగభగలు కొనసాగుతూనే ఉన్నాయి. మధ్యాహ్నం పూట రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోతతో జనం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు.. తాజాగా వాతావరణ శాఖ అధికారులు కీలక విషయాలు చెప్పారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత మరింత పెరగనున్నట్లు తెలిపారు. మరీ ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు ఏకంగా రెడ్ అలర్ట్ జారీ చేశారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రానున్న 3 రోజుల పాటు ఉత్తర తెలంగాణలో సూర్యుడి ప్రతాపం తీవ్రరూపం దాల్చనున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. మరీ ముఖ్యంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఇక రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అత్యధికంగా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటి నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తీవ్ర హెచ్చరికలు చేశారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి మధ్యాహ్నం పూట బయటికి రావద్దని హెచ్చరికలు చేశారు. తప్పనిసరిగా బయటికి వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత కారణంగా వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరీ ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక రోగులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. మరీ ముఖ్యంగా ఈనెల 16, 17, 18వ తేదీల్లో తెలంగాణ వ్యాప్తంగా వడగాలులు వీచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇక రాష్ట్రంలో గత 2 రోజుల నుంచి ఎండ తీవ్రత పెరగడం గమనార్హం. ఆదిలాబాద్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43.5 డిగ్రీల వరకు నమోదు కాగా.. మెదక్‌లో 42 డిగ్రీలు.. హైదరాబాద్ సహా మిగిలిన జిల్లాల్లో సుమారు 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

# అల్పాహారం పంపిణీ అభినందనీయం




**కోదాడ మే 14, (సాక్ష్యం)** తెలంగాణ హైకోర్టు న్యాయవాది నకిరికంటి వెంకట లక్ష్మీ నరసింహారావు సతీమణి కాంతామణి జన్మదిన సందర్భంగా కోదాడలోని శనగల రాధాకృష్ణ మానసిక వికలాంగుల కేంద్రంలోని విద్యార్థులకు గురువారం అల్పాహారం, అరటి పండ్లు అందజేయడం అభినందనీయని పందిరి ఫౌండేషన్ గౌరవ సలహాదారు ఎస్ఎస్ రావు అన్నారు. కార్యక్రమానికి సహకరించిన నకిరికంటి సత్య కిరణ్ అర్చన దంపతులకు యస్ యస్ రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పందిరి ఫౌండేషన్ సభ్యులు సేకు రమేష్, మిట్టపల్లి నరసింహారావు అనాథాశ్రమ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సాయిమందిరంలో

# అన్నదానం, విశేష పూజలు



**కోదాడ మే 14, (సాక్ష్యం)** కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామ షిర్డీ సాయి బాబా మందిరంలో గురువారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన లింగయ్య సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నల్లపాటి నర్సింహారావు, అర్చకుడు సాయి శర్మ, సూర్యనారాయణ, హేమంత్ చౌదరి, భక్తులు పాల్గొన్నారు.

# రైతులకు శాస్త్రవేత్తల సలహాలు



**కోదాడ మే 14, (సాక్ష్యం)** కోదాడ క్లస్టర్ రైతుల కోసం అల్వాలపురం లోని రైతు వేదిక లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం నుండి శాస్త్రవేత్తలు నూతన వ్యవసాయ పద్ధతులు, ఆయిల్ పామ్ సాగు, సమతుల్య ఎరువుల యాజమాన్యం,ప్రకృతి వ్యవసాయం వంటి వాటి మీద అవగాహన కల్పించారు. ఇట్టి కార్యక్రమంలో దొరకుంట సర్పంచ్ పాలకి సురేష్ మంగళ్ తండా సర్పంచ్ బాబ్జి నాయక్,కోదాడ మండలం ఏఈ పాలెం రజిని, వ్యవసాయశాస్త్రవేత్తలు రజనీకాంత్, శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణ అధికారి మహేష్. రైతులు పాల్గొన్నారు

## రెడ్లకుంటలో సాగునీటి కాలువ పునరుద్ధరణ

# పనులను పరిశీలించిన డీఈ సువర్ణరేఖ



**కోదాడ మే 14,( సాక్ష్యం)** కోదాడ మండలం, రెడ్లకుంట గ్రామంలోని ఎస్సీ మాన్యాల రైతులకు సాగునీటి కష్టాల నుండి విముక్తి కల్పిస్తూ ఎన్.హెచ్.పి కెనాల్ నుండి సాగునీటి కాలువ పునరుద్ధరణ పనులను నీటి పారుదల శాఖ డి.ఈ సువర్ణరేఖ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలంపల్లి కుటుంబరావు, ఉప సర్పంచ్ మల్లెల ప్రసాద్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగవరపు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.





# 2026 ట్రై సిరీస్‌కు భారత జట్టును ప్రకటించిన బీసీసీఐ

### టీమ్ఇండియాలోకి వైభవ్ సూర్యవంశీ ఎంపిక

### కేప్టెన్‌గా తిలక్ వర్మ, వైస్ కెప్టెన్‌గా రియాన్ పరాగ్

రాజస్థాన్ రాయల్స్ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీకి టీమ్ఇండియా పిలుపు అందింది. సెలక్టర్లు అతడిని భారత జాతీయ జట్టులోకి తీసుకున్నారు. ప్రస్తుతం క్రికెట్ లవర్స్ ఐపీఎల్ ఎంజాయ్ చేస్తున్న వేళ బీసీసీఐ మరో కీలక సిరీస్‌కు భారత్– ఏ జట్టును ప్రకటించింది. వచ్చే నెల శ్రీలంక, అఫ్గానిస్థాన్ జట్లతో జరగనున్న ట్రై సిరీస్‌కు 15 మందితో కూడిన జట్టును వెల్లడించింది. ఈ జట్టుకు తిలక్ వర్మ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. రియాన్ పరాగ్ వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ సిరీస్‌కు వైభవ్‌ను కూడా ఎంపిక చేశారు.వైభవ్‌తోపాటు పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ఆయుశ్ బదోనీ, విప్రజ్ నిగమ్, హర్ష్ దూబే, యశ్ ఠాకూర్, హర్ష్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, అర్షద్ ఖాన్ తొలిసారి టీమ్ఇండియా పిలుపు అందుకున్నారు. ఈ జట్టులో దాదాపు ప్రస్తుత ఐపీఎల్‌లో అదరగొడుతున్న ఆటగాళ్లకే సెలక్టర్లు ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే ఈ సిరీస్‌తో వైభవ్‌ను ఎప్పుడెప్పుడు టీమ్ఇండియా జట్టులో చూద్దామా అనుకున్న ప్రేక్షకుల ఎదురుచూపులకు తెరపడినట్లు అయ్యింది! మరి మన కుర్రాళ్లు ఎంతవరకు ఆకట్టుకుంటారో చూడాలి.కాగా, భారత్– శ్రీలంక– అఫ్గానిస్థాన్ జట్లు తలపడనున్న ఈ సిరీస్‌ను వన్డే ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. శ్రీలంక వేదికగా జూన్ 09న సిరీస్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంకతో భారత్ తలపడనుంది. ఒక్కో జట్టు ఈ సిరీస్‌లో నాలుగేసి మ్యాచ్‌లు ఆడుతుంది. టాప్ 2లో నిలిచిన రెండు జట్లు టైటిల్ ఫైట్‌లో పాల్గొంటాయి. జూన్ 21న ఫైనల్ మ్యాచ్ ఉండనుంది.

**ట్రై సిరీస్‌కు భారత్ ఏ జట్టు**

తిలక్ వర్మ (కెప్టెన్), ప్రియాంశ్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్ (వైస్ కెప్టెన్), ఆయుష్ బదోని, నిషాంత్ సింధు, హర్ష్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), కుమార్ కుషాగ్రా (వికెట్ కీపర్), విప్రజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్‌వీర్ సింగ్, అన్షుల్ కంబోజ్, అర్షద్ ఖాన్'

## శార్దూల్ బంతికి బిత్తరపోయిన శ్రేయస్ అయ్యర్

ధర్మశాల స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ ధాటిగా ఇన్నింగ్స్ ప్రారంభించింది. 11 ఓవర్లు ముగిసేసరికి పంజాబ్ ఒక వికెట్ నష్టానికి 107 పరుగులు చేసి పటిష్ట స్థితిలో ఉంది. ఈ దశలో ముంబై తాత్కాలిక కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా, 12వ ఓవర్ వేసే బాధ్యతను శార్దూల్ ఠాకూర్‌కు అప్పగించాడు. ఆ ఓవర్ రెండో బంతికే సెంచరీ దిశగా సాగుతున్న ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌ను అవుట్ చేసిన శార్దూల్, ముంబైకి బ్రేక్ ఇచ్చాడు. ప్రభ్‌సిమ్రాన్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఎదుర్కొన్న మొదటి బంతికే ఫోర్ కొట్టి శుభారంభం చేశాడు. అయితే ఆ మరుసటి బంతికే శార్దూల్ ఒక అద్భుతాన్ని సృష్టించాడు. గుడ్ లెంగ్త్‌లో పడిన బంతి అనూహ్యంగా స్వింగ్ అవుతూ ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. ఆ బంతిని అంచనా వేయడంలో అయ్యర్ పూర్తిగా విఫలమయ్యాడు. బంతి వెళ్లిన వేగానికి, ఆ స్వింగ్‌కు అయ్యర్



నోరెళ్లబెట్టాడు. కనీసం బంతి ఎటు నుంచి వచ్చిందో కూడా అర్థం కాక అయోమయంలో ఉండిపోయాడు.అయ్యర్ వికెట్ తీసిన వెంటనే శార్దూల్ ఆనందానికి అవధులు లేవు. మైదానంలో పరుగెత్తుతూ తనదైన శైలిలో సంబరాలు చేసుకున్నాడు. ఒకే ఓవర్లో ఇద్దరు కీలక బ్యాటర్లను అవుట్ చేసి పంజాబ్‌ను కష్టాల్లోకి నెట్టాడు. ఈ వీడియో ఇప్పుడు క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. నెటిజన్లు దీనిని "సీజన్ ఉత్తమ బంతి"గా అభివర్ణిస్తున్నారు. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో శార్దూల్ చేసిన ఈ ప్రయోగం ముంబై జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది.మంచి ఆరంభం లభించినా, శార్దూల్ వేసిన ఆ ఒక్క ఓవర్ పంజాబ్ స్కోరు వేగాన్ని తగ్గించింది. కెప్టెన్ అయ్యర్ తక్కువ పరుగులకే వెనుదిరగడం జట్టుపై ఒత్తిడి పెంచింది. బుమ్రా వ్యూహం పారడంతో ముంబై ఇండియన్స్ మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఈ అద్భుతమైన డెలివరీ ఐపీఎల్ చరిత్రలో ఒక ప్రత్యేకమైన వికెట్‌గా నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.



## విమర్శకుల నోర్లు మూయించిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్

ఈ ఐపీఎల్ సీజన్ మధ్యలో ప్రభ్‌సిమ్రాన్ సింగ్ సుమారు 10 కిలోల బరువు పెరిగాడని, దాని వల్ల ఆయన క్రీజులో చురుగ్గా కదలలేకపోతున్నారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. గత మూడు ఇన్నింగ్స్‌ల్లో విఫలం కావడంతో ఈ విమర్శలు మరింత ఎక్కువయ్యాయి. అయితే ముంబై ఇండియన్స్‌తో జరిగిన పోరులో ఆయన తన అసాధారణ క్లాస్ ప్రదర్శించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బరువు పెరిగారన్న వారికి తన పరుగుల వేగంతోనే గట్టి జవాబు ఇచ్చాడు.ధర్మశాల స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రభ్‌సిమ్రాన్ సింగ్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 32 బంతుల్లోనే 57 పరుగులు సాధించి ముంబై బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. ఈ ఇన్నింగ్స్‌లో మొత్తం 10 బౌండరీలు (6 ఫోర్లు, 4 సిక్సర్లు) బాదాడు. 178.12 స్ట్రైక్ రేటుతో సాగిన ఈ మెరుపు ఇన్నింగ్స్ ప్రస్తుత సీజన్‌లో ఆయనకు ఐదవ అర్ధ సెంచరీ కావడం విశేషం. స్టాండ్స్‌లో కూర్చున్న పంజాబ్ కింగ్స్ యజమాని ప్రీతి జింటా, ప్రభ్‌సిమ్రాన్ షాట్లకు ముగ్ధురాలై నిలబడి చప్పట్లతో అభినందించాడు.ప్రభ్‌సిమ్రాన్ ఈ భారీ ఇన్నింగ్స్ ఆడటంలో అదృష్టం కూడా కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో ఆయనకు రెండుసార్లు లైఫ్ లభించింది. వ్యక్తిగత స్కోరు 5 పరుగుల వద్ద ఉన్నప్పుడు నమన్ ధీర్ క్యాచ్ జారవిడచగా, 28 పరుగుల వద్ద కార్బిన్ బాష్ మరో క్యాచ్ వదిలేశాడు. ఈ అవకాశాలను చక్కగా వినియోగించుకున్న ప్రభ్‌సిమ్రాన్, పంజాబ్ జట్టుకు బలమైన పునాది వేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు 12 మ్యాచ్‌లలో 43.90 సగటుతో 439 పరుగులు సాధించాడు. ముఖ్యంగా 170.15 స్ట్రైక్ రేటుతో పరుగులు రాబడుతూ జట్టుకు మెరుపు ఆరంభాలను అందిస్తున్నాడు.కీలక సమయంలో ప్రభ్‌సిమ్రాన్ ఫామ్‌లోకి రావడం పంజాబ్ జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది. విమర్శలను పట్టించుకోకుండా తన పని తాను చేసుకుపోతే విజయం వరిస్తుందని ఆయన నిరూపించాడు.

## నిప్పులు చెరిగిన శార్దూల్ ఠాకూర్, దీపక్ చాహర్

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 201 పరుగుల లక్ష్యాన్ని నమోదు చేసింది. ముంబై ఇండియన్స్ బౌలర్లు శార్దూల్ ఠాకూర్(4/39), దీపక్ చాహర్(2/36) నిప్పులు చెరగడంతో ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 200 పరుగులు చేసింది.ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్(32 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 57) హాఫ్ సెంచరీతో రాణించగా.. అజ్మతుల్లా ఒమర్జాయ్(17 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 38) దూకుడుగా ఆడాడు. కార్బిన్ బోష్, రాజ్ బావకు చెరో వికెట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఆటగాళ్లు ఏకంగా 4 క్యాచ్‌లు వదిలేసారు. లేకుంటే పంజాబ్ ఇంకా తక్కువ స్కోర్‌కే పరిమితమయ్యేది.టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్‌కు ఓపెనర్లు అదిరిపోయే



ఆరంభాన్ని అందించారు. బుమ్రా వేసిన రెండో ఓవర్‌లోనే ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఇచ్చిన ఈజీ క్యాచ్‌ను నమన్ ధీర్ నేలపాలు చేశాడు. ఈ అవకాశంతో ప్రభ్‌సిమ్రాన్ సింగ్ చెలరేగాడు. దూకుడుగా ఆడేందుకు ఇబ్బంది పడిన ప్రియాన్ష్ ఆర్య(22)ను దీపక్ చాహర్ పెవిలియన్‌కు చేర్చాడు. దాంతో పవర్ ప్లేలో పంజాబ్ కింగ్స్ వికెట్ నష్టానికి 55 పరుగులు చేసింది. భారీ సిక్స్‌లతో విరుచుకుపడిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్ 29 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దూకుడుగా ఆడుతున్న అతన్ని శార్దూల్ ఠాకూర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 57 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అదే ఓవర్‌లో శ్రేయస్ అయ్యర్(4)ను కూడా ఔట్ చేయగా.. కూపర్ కానోల్లీ(21)ని రాజ్ బవ పెవిలియన్ చేర్చాడు. తన మరుసటి ఓవర్‌లో సూర్యాన్ష్ షెడ్గే(8)ను ఔట్ చేసిన శార్దూల్ ఠాకూర్.. పంజాబ్‌ను కోలుకోలేని దెబ్బతీసాడు.శాంక్ సిగ్(2)ను కార్బిన్ బోష్ ఔట్ చేయగా.. శార్దూల్ ఠాకూర్ తన చివరి ఓవర్‌లో మార్కో జాన్సెన్(27)ను పెవిలియన్ చేర్చాడు. దాంతో పంజాబ్ 160 పరుగులైనా చేస్తుందా? అనిపించింది. కానీ అజ్మతుల్లా ఒమర్జాయ్ భారీ షాట్స్‌తో విరుచుకుపడ్డాడు. అతన్ని దీపక్ చాహర్ ఔట్ చేసినా.. ఇంపాక్ట్ ప్లేయర్ విష్ణు వినోద్ భారీ షాట్లతో జట్టు స్కోర్‌ను 200కు చేర్చాడు. విష్ణు వినోద్ ఇచ్చిన క్యాచ్‌లను రాబిన్ బింజ్, తిలక్ వర్మ వదిలేసారు. ఈ పిచ్‌పై ఇది తక్కువ స్కోరే అయినా ముంబై ఎలా బ్యాటింగ్ చేస్తుందో చూడాలి.



## సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్స్ చేరాలంటే ..

ఐపీఎల్ 2026లో భాగంగా అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చిత్తు చిత్తుగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. 82 పరుగుల తేడాతో ఘోర ఓటమిని చవిచూసింది. ఫలితంగా ఎస్ఆర్‌హెచ్ నెట్‌రన్‌రేటు (ం0.331) దారుణంగా పడిపోయింది.

ఈ ఓటమితో పాయింట్ల పట్టికలో ప్రస్తుతానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ స్థానం మారకున్నా కూడా ప్లేఆఫ్స్ అవకాశాలు మాత్రం కొద్దిగా కష్టంగా మారాయి. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలవాల్సిన పరిస్థితి ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ 12 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 7 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. మరో 5 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ప్రస్తుతం 14 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతోంది. లీగ్ దశలో ఎస్ఆర్‌హెచ్ మరో రెండు మ్యాచ్‌లు మే 18న చెన్నైతో, మే22న ఆర్‌సీబీతో ఆడనుంది. అయితే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ప్లేఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకోవాలంటే.. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మిగిలిన రెండు మ్యాచ్‌లు.. చెన్నై, ఆర్‌సీబీపై విజయం సాధించాల్సి ఉంటుంది. అప్పుడు సన్‌రైజర్స్ ఖాతాలో 18 పాయింట్లు ఉంటాయి. మెరుగైన రన్‌రేటు కలిగి ఉంటే ఇతర జట్ల సమీకరణాలు కలిసి వస్తే టాప్–2లో కూడా చోటు దక్కించుకోవచ్చు. ఇక మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఎస్ఆర్‌హెచ్ ఒక్క మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికి కూడా ప్లేఆఫ్స్‌కు చేరుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే.. అప్పుడు సన్‌రైజర్స్ ఖాతాలో 16 పాయింట్లు ఉంటాయి. అయినా కూడా ఇతర జట్ల ఫలితాలతో పాటు నెట్‌రన్‌రేటుపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇందుకోసం నెట్‌రన్‌రేటును మెరుగు పరుచుకోవాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే.. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓడిపోతే మాత్రం అప్పుడు ప్లేఆఫ్స్ ఛాన్స్ సంక్లిష్టం అవుతుంది. 14 పాయింట్లే ఎస్ఆర్‌హెచ్ ఖాతాలో ఉంటాయి. నాలుగో స్థానంతోనైనా ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టే అవకాశం ఉంది. 14 పాయింట్లు సాధించిన మిగిలిన జట్ల కంటే ఎస్ఆర్‌హెచ్ రన్‌రేటు మెరుగ్గా ఉండడంతో పాటు మూడు కంటే ఎక్కువ జట్లు ఎస్ఆర్‌హెచ్ పాయింట్ల కంటే ఎక్కువగా ఉండకూడదు.

## పురుషుల క్రికెట్ జట్టుకు మహిళా కోచ్..

క్రికెట్ ప్రపంచంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. క్రీడల్లో లింగ వివక్షను చెరిపివేస్తూ, ప్రతిభకు పట్టం కట్టే దిశగా ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఒక సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. పురుషుల క్రికెట్ జట్టుకు కోచింగ్ ఇచ్చే బాధ్యతను ఒక మహిళా క్రికెటర్‌కు అప్పగించింది. ఇంగ్లాండ్ టెస్ట్ జట్టు (స్టోక్స్ సేన) కోసం ఫీల్డింగ్ కోచ్‌గా ఆ దేశ దిగ్గజ మహిళా క్రికెటర్ సారా టేలర్‌ను ఎంపిక చేస్తూ అధికారిక ప్రక్రియను పూర్తి చేసింది. పురుషుల అంతర్జాతీయ క్రికెట్ జట్టుకు ఒక మహిళ కోచ్‌గా వ్యవహరించబోతుండడం క్రీడా చరిత్రలోనే ఇదే తొలిసారి కావడం విశేషం. సారా టేలర్ ఇంగ్లాండ్ మహిళా క్రికెట్ జట్టులో ఒక అద్భుతమైన వికెట్ కీపర్ బ్యాటర్‌గా గుర్తింపు పొందింది. ప్రస్తుతం 37 ఏళ్ల వయసున్న సారా, తన సుదీర్ఘ కెరీర్‌లో ఇంగ్లాండ్ తరపున వివిధ ఫార్మాట్లలో మొత్తం 226 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. ఆమె వికెట్ల వెనుక చూపించే చురుకుదనం, బ్యాటింగ్‌లో ఆమెకున్న నైపుణ్యం ప్రపంచవ్యాప్తంగా ఎందరో అభిమానులను సంపాదించి పెట్టింది. మానసిక ఆరోగ్య సమస్యల కారణంగా ఆమె అంతర్జాతీయ క్రికెట్ నుండి రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ, కోచింగ్ రంగంలో తనదైన ముద్ర వేస్తోంది. సారా టేలర్‌కు కేవలం క్రీడాకారిణిగానే కాకుండా, కోచ్‌గా కూడా మంచి అనుభవం ఉంది. గతంలో ఆమె ఇంగ్లాండ్–ఎ జట్టు కోచింగ్ బృందంలో సభ్యురాలిగా పనిచేసింది. కేవలం జాతీయ స్థాయిలోనే కాకుండా, ఫ్రాంచైజీ క్రికెట్‌లోనూ ఆమె తన ప్రతిభను నిరూపించుకుంది. ససెక్స్ కౌంటీ జట్టుకు మరియు 'ది హండ్రెడ్' టోర్నమెంట్‌లో మాంచెస్టర్ ఒరిజినల్స్ జట్టుకు ఆమె ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందించింది. ఈ క్రమంలో పురుషుల జట్లతో పనిచేసిన అనుభవం ఆమెకు ఉండడం, ఇప్పుడు ఇంగ్లాండ్ టెస్ట్ జట్టుకు (స్టోక్స్ సేన) కోచ్‌గా ఎంపికవడానికి ప్రధాన కారణమైంది. ప్రస్తుతం ఇంగ్లాండ్ టెస్ట్ జట్టు 'బజ్‌బాల్' శైలిలో దూకుడుగా ఆడుతోంది. బ్యాటింగ్, బౌలింగ్‌లోనే కాకుండా ఫీల్డింగ్‌లో కూడా అదే వేగం, చురుకుదనం అవసరమని బోర్డు భావించింది. ప్రపంచంలోని అత్యుత్తమ వికెట్ కీపర్లలో ఒకరిగా పేరుగాంచిన సారా టేలర్ పర్యవేక్షణలో, ఇంగ్లాండ్ ఆటగాళ్ల ఫీల్డింగ్ ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా క్లోజ్–ఇన్



క్యాచింగ్, రిఫ్లెక్స్ పెంపొందించుకోవడంలో ఆమె సలహాలు ఆటగాళ్లకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. సాధారణంగా పురుషుల జట్లకు పురుషులే కోచ్‌లుగా ఉండడం మనం చూస్తుంటాం. కానీ సారా టేలర్ నియామకం ఈ సంప్రదాయాన్ని బద్దలు కొట్టింది. ఇది కేవలం ఒక నియామకం మాత్రమే కాదు, భవిష్యత్తులో మరికొంతమంది మహిళా కోచ్‌లు పురుషుల జట్లతో కలిసి పనిచేయడానికి ఒక మార్గదర్శిగా నిలుస్తుంది. మహిళా క్రికెటర్లకు కేవలం ఆటకు మాత్రమే పరిమితం కాకుండా, రిటైర్మెంట్ తర్వాత అత్యున్నత స్థాయి కోచింగ్ బాధ్యతలు చేపట్టవచ్చునే నమ్మకాన్ని ఈ నిర్ణయం కలిగించింది.

సాక్ష్యం





## కామెడీ, మిస్టరీ అంశాలతో ఆసక్తిని పెంచుతోన్న "మేము'కాప్'లం" ట్రైలర్..

### మే 22 నుంచి జీ5 నుంచి సిరీస్ స్ట్రీమింగ్

జీ5 ఎప్పటికప్పుడు వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో డిఫరెంట్ వెబ్ సిరీస్‌తో ఆడియెన్స్‌ను అలరించటానికి సిద్ధమైంది. అదే ''మేము'కాప్'లం''. కొన్నాళ్ల నుంచి ఈ సిరీస్ టైటిల్ దగ్గర నుంచి ప్రతీ విషయంలోనూ క్యూరియాసిటీని పెంచుతోంది. మే 22 నుంచి ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్‌పై మరింత ఆసక్తిని పెంచేలా ''మేము'కాప్'లం'' ట్రైలర్‌ను విడుదల చేశారు.. ట్రైలర్‌ను గమనిస్తే.. మహదేవపట్నం అనే ప్రాంతంలో కథ మొదలవుతుంది. అయ్యగారు వారసుడొచ్చాడండోయ్.. అని పాలేరు అని అరిచి మరి చెబుతాడు. అప్పుడు గజపతిరాజు పాత్రలో నటించిన నాగబాబు ఆనందపడతాడు. సలార్‌రాజు తన వారసుడు అని ప్రకటిస్తాడు. అయితే అనుకోకుండా ఆ సలార్ రాజు కనిపించకుండా పోతాడు. దీంతో ఊరంతా గందరగోళంలో పడుతుంది. ఇంతకీ సలార్ రాజు ఎవరో కాదు.. కోళ్ల పందెల్లో పాల్గొనాల్సిన కోడిపుంజు. దీన్ని వెతకట◌ానికి ఇద్దరు పోలీసులు(గెటప్ శీను, రవితేజ నన్నిమల) ఊళ్లోకి వస్తారు. సలార్ రాజు కనిపించకపోవటం వల్ల..ఎవరికి లాభం అనే కోణంలో పోలీసులు అన్వేషిస్తుంటారు. అయితే వారికి ఊళ్లో మరో సమస్య కనిపిస్తుంది. దీంతో వాళ్లు కొత్త సమస్య నుంచి ఊరిని బయటపడేయటానికి ప్రయత్నిస్తారు. ఇంతకీ మహదేవపట్నంలోని ప్రధాన సమస్య ఏంటి? పోలీసులు దాన్ని ఎలా పరిష్కరిస్తారు. అసలు ఇంతకీ సలార్ రాజు దొరికాడా? లేదా? అనే విషయాలు తెలియాలంటే మే 22న జీ5లో స్ట్రీమింగ్ కానున్న ''మేము'కాప్'లం'' వెబ్ సిరీస్ చూడాల్సిందేనంటున్నారు మేకర్స్. నాగబాబు ప్రధాన పాత్రలో నటించిన ''మేము 'కాప్'లం'' సిరీస్‌ను రా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై బి.వి.ఎస్. రవి, కౌముది కె నేమాని నిర్మాతలుగా ప్రదీప్ మద్దాలి క్రియేటివ్‌తో కలిసి రూపొందింది. 'వికటకవి' డైరెక్టర్ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. శోభన్ చిట్టుప్రోలు కథను అందించారు. గెటప్ శ్రీను, రవితేజ నన్నిమల కీలక పాత్రల్లో నటించారు. కామెడీ, మిస్టరీ కలయికగా అందరినీ ఆకట్టుకునే కథాంశంతో..గ్రామీణ నేపథ్యంలో, అక్కడి రోజువారీ జీవితం, స్థానిక రాజకీయాలు, ఊహించని గందరగోళం..ఇలా అన్నీ కలగలిపిన ఆసక్తికరమైన కథతో ఈ సిరీస్ తెరకెక్కింది. కోడి పందేలనే పిచ్చిలో మునిగిపోయిన గ్రామంలో ఊరిలో డబ్బున్నవారందరూ పోటీ పడుతుంటారు. వారిలో ఒక వ్యక్తికి సంబంధించిన పందెం కోడి ఆకస్మాత్తుగా కనిపించకుండా పోతుంది. దీంతో గ్రామంలో ఓ గందరగోళం మొదలవుతుంది. ఆ కేసు విచారణ బాధ్యతను పోలీసు అధికారులు ఇద్దరు అమాయక పోలీసులైన రవి, మోహన్ సోటారిలకు అప్పగిస్తారు. కోడి కోసం అన్వేషణ సాధారణంగా మొదలవుతుంది. అయితే అనుకోని ఘటనతో కేసు ఓ పెద్ద మిస్టరీగా మారిపోతుంది. విచారణలో వారు చేసే తప్పులు, ఎదురయ్యే విచిత్ర పరిస్థితులు నవ్వులు పూయిస్తూనే ఉంటాయి. కానీ ఆ గందరగోళంలోనే వారు అనుకోకుండా గ్రామపు మూలాలను కదిలించే ఒక పెద్ద రహస్యానికి దగ్గరవుతారు.

## మైసా కోసం రష్మిక ప్రత్యేక ట్రైనింగ్

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైసా'పై ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కేరళ షెడ్యూల్ పూర్తి చేసిన రష్మిక.. అక్కడి అనుభవాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. కొచ్చిలో జరిగిన షూటింగ్ గురించి రష్మిక చేసిన పోస్టులు ఇప్పుడు నెటింట చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి అందాలు, అడవులు, జలపాతాలు, ఎత్తైన కొండలు, వర్షాల మధ్య సాగిన షూటింగ్ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని ఆమె వెల్లడించారు. ప్రత్యేకంగా ఎత్తైన ప్రదేశాలంటే తనకు భయం ఉన్నప్పటికీ.. 'మైసా' సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఆ భయాన్ని ఎదుర్కొంటూ స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నానని రష్మిక తెలిపారు. షూటింగ్ సమయంలో అడవుల్లో ట్రెక్కింగ్, ఔట్‌డోర్ యాక్షన్ ఎపిసోడ్స్, భారీ వర్షాల మధ్య చిత్రీకరణ చాలా కష్టంగా సాగిందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్ల కోసం శారీరకంగా చాలానే శ్రమపడాల్సి వచ్చిందని రష్మిక వెల్లడించారు. మోకాళ్లు, కాళ్లకు టేపింగ్ వేసుకుని కూడా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనతో పనిచేస్తున్న యూనిట్ సభ్యులు కూడా జాగ్రత్తగా ఉండాలని తరచూ చెప్పేదాన్నని గుర్తు చేసుకున్నారు. అయితే ఈ కష్టాల మధ్య కేరళలో ఫేమస్ అయిన 'పాళమ్ పూరీ'ని మాత్రం బాగా ఎంజాయ్ చేశానంటూ సరదాగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. అలాగే బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న కొన్ని ఫొటోలను కూడా రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోల్లో ఆమె చాలా నేచురల్‌గా కనిపించడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'మైసా' సినిమా విషయానికి వస్తే.. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా హై ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది.



# "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా నిర్మాతగా నాకెంతో సంతృప్తిని మిగిల్చింది - కిరణ్ అబ్బవరం

### – సందడిగా "తిమ్మరాజుపల్లి టీవీ" సంబరాలు ఈవెంట్
### – ఈ నెల 15వ తేదీ నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు వస్తున్న "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా

న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మించిన సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా నటించారు. "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమయ్యారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్నిసొంతం చేసుకుంది. తాజాగా ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్ కు సిద్ధమయ్యింది. "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా ఈ నెల 15వ తేదీ నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు రాబోతోంది. ఈ సందర్భంగా "తిమ్మరాజు పల్లి టీవీ" సంబరాలు ఈవెంట్ ను హైదరాబాద్ లో సందడిగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆహా నుంచి శ్రీనివాస్ మాట్లాడుతూ – ఎస్ఆర్ కల్యాణమండపం సినిమా కోసం ఫస్ట్ టైమ్ కిరణ్ గారితో మాట్లాడాను. అప్పటి నుంచి వారితో మా ఆహా జర్నీ కంటిన్యూ అవుతోంది. సమ్మతమే, రూల్స్ రంజన్, కె ర్యాంప్..ఇలా ఆయన సినిమాలన్నీ మా ఆహాలో స్ట్రీమింగ్ లో ఉన్నాయి. ఇప్పుడు "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమాను ఆహా సబ్ స్కైబర్స్ ముందుకు తీసుకురావడం సంతోషంగా ఉంది. నేను పర్సనల్ గా ఈ సినిమా చూస్తూ బాగా కనెక్ట్ అయ్యాను. ఆహా ద్వారా లో మా సినిమా రిలీజైనప్పుడు ఒక్కరు కూడా నెగిటివ్ గా చెప్పలేదు. మంచి రెస్పాన్స్ ఇచ్చారు. సపోర్ట్ చేశారు. థియేటర్స్ లో మా సినిమా చూడని వారు ఆహాలో చూడండి. మీరు ఖచ్చితంగా సినిమా మొత్తం ఎంజాయ్ చేస్తారు. కిరణ్ గారు ఇలాగే కొత్త టాలెంట్ కు అవకాశాలు ఇవ్వాలని కోరుకుంటున్నా. అన్నారు. నటుడు ప్రదీప్ కొట్టె మాట్లాడుతూ – థియేటర్స్ లో "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమాను చూసిన వాళ్లు వాళ్ల రెస్పాన్స్ చెప్పినప్పుడు మా టీమ్ అంతా హ్యాపీగా ఫీలయ్యాం. కిరణ్ గారికి మేమంతా థ్యాంక్స్ చెబుతూనే ఉంటాం. ఆహా గోల్డ్ వారికి ఇప్పటికే మూవీ అందుబాటులో ఉంది. ఈ నెల 15 నుంచి సబ్ స్కైబర్స్ అంతా చూసి మా సినిమాను సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నా. అన్నారు. హీరో సాయి తేజ్ మాట్లాడుతూ – మా టీమ్ అంతా మరోసారి ఈవెంట్ లో కలుసుకున్నాం. ఇలా మీట్ అవడం మా అందరికీ సంతోషాన్నిస్తోంది. కొత్త టాలెంట్ కు అవకాశం కల్పించిన సుమైర స్టూడియోస్, కేఏ ప్రొడక్షన్స్ కు థ్యాంక్స్ చెబుతున్నాం. థియేటర్స్ లో మీరు మంచి సక్సెస్ అందించారు. ఇప్పుడు ఆహా ద్వారా మరింత మంది ఆడియెన్స్ కు మా "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా రీచ్ అవుతుంది. మా టీవీ ఇప్పుడు మీ ఇంట్లో టీవీలోకి ఆహా ద్వారా వస్తోంది. అన్నారు. ప్రొడ్యూసర్ కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ – నా సక్సెస్, ఫెయిల్యూర్స్ లో



మరింతమంది ప్రేక్షకులకు "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా రీచ్ అవుతుందని ఆశిస్తున్నాం. అన్నారు. ఆర్ట్ డైరెక్టర్ సుధీర్ మాచర్ల మాట్లాడుతూ – ఆహా ఈవెంట్ తో మరోసారి మా టీమ్ అంతా కలుసుకోవడం సంతోషంగా ఉంది. థియేటర్స్ లో మా మూవీని ప్రేక్షకులు బాగా ఆదరించారు. ఆహాలో ఇంకా ఎక్కువ రెస్పాన్స్ వస్తుందని అనుకుంటున్నాం. ఈ చిత్రానికి పనిచేసిన వారందరికీ ఇండస్ట్రీలో మంచి ఫ్యూచర్ ఉంటుంది. అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ వంశీకాంత్ రేఖన మాట్లాడుతూ – ఈ సినిమా టైమ్ లో ఎన్నో మిక్స్డ్ ఎమోషన్స్ తో ఉన్నాను. ఈ సినిమాకు మ్యూజిక్ అందించే సమయంలో కిరణ్ గారు, డైరెక్టర్ మునిరాజు ఎంతో సపోర్ట్, ఫ్రీడమ్ ఇచ్చారు. ఈ సినిమా మ్యూజిక్ డైరెక్టర్ నేను అని గర్వంగా చెప్పుకుంటాను. అన్నారు. డైరెక్టర్ వి.మునిరాజు మాట్లాడుతూ – ఈ సినిమాతో మేము ఎలాంటి విజయాన్ని ఆశించామో, ఎలాంటి రెస్పాన్స్ ఆశించామో అది దక్కింది. ప్రేక్షకులు థియేటర్స్ లో మా సినిమాను ఆదరించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఆహాలో కూడా సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా. ఈ చిత్రాన్ని చూసి, బాగుందని చెప్పి సీఎం చంద్రబాబు గారి దగ్గరకు నన్ను మా వాళ్లు తీసుకెళ్లారు. ఈ చిత్రంలో నటించిన వారికి, సినిమాకు పనిచేసిన టెక్నీషియన్స్ అందరికీ మంచి పేరు దక్కింది. అన్నారు. నటి స్వాతి కరిమిరెడ్డి మాట్లాడుతూ – మా "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమాను థియేటర్స్ లో చూస్తూ ప్రేక్షకులు తమ మెమొరీస్ గుర్తుకుతెచ్చుకున్నారు. వాళ్లు పర్సనల్ గా మా సినిమాతో కనెక్ట్ అయ్యారు. ఇప్పుడు ఆహాలోకి మా సినిమా వస్తోంది. ఆహాలో సక్సెస్ అయ్యాక సక్సెస్ మీట్ లో మళ్లీ కలుస్తాను. అన్నారు. హీరోయిన్ వేద జలంధర్ మాట్లాడుతూ – థియేటర్స్ ఆహా తోడుగా ఉంది. ఆహాలో నా సక్సెస్ ఫుల్ సినిమాలతో పాటు ఫెయిల్యూర్ సినిమాలు కూడా ఉన్నాయి. రామ్ గారు, అరవింద్ గారు కిరణ్ సినిమా అంటే నమ్మకంతో తీసుకుంటారు. వారికి కృతజ్ఞతలు చెబుతున్నారు. శ్రీనివాస్ గారు నాతో ఒక సోదరుడిలా ఉంటారు. సినిమాల గురించి చర్చించుకుంటాం. నా మూవీస్ గురించి కనుక్కుంటారు. నేను నా సినిమాలు ఆహాలో ఎలాంటి రెస్పాన్స్ తెచ్చుకుంటాయో తెలుసుకుంటాను. తిమ్మరాజు పల్లి టీవీ సినిమా విషయంలో సంతృప్తిగా ఉన్నాను. ఇలాంటి కాంపాక్ట్ బడ్జెట్ లో మేము అఛీవ్ మెంట్ చేశాం. అది మా మూవీ టీమ్ వల్లే సాధ్యమైంది. వీళ్లందరి సపోర్ట్ వల్లే ఇంత మంచి క్వాలిటీ సినిమా చేయగలిగాం. కిరణ్ కొత్త వాళ్లతో సినిమా చేశాడని..మీడియా మిత్రులు కూడా మాకు బాగా సపోర్ట్ చేశారు. ఏవైనా చిన్న చిన్న తప్పులుంటే సరిచేసుకుంటాం. మాతో అసోసియేట్ అయిన సుమైర స్టూడియోస్ తేజ వేల్పుచర్లకు థ్యాంక్స్. నెలరోజుల్లోనే మా టీమ్ అందరికీ మంచి అవకాశాలు వస్తున్నాయి. ఇలాంటి ప్రతిభ గల వారికి అవకాశాలు దక్కాలనే మేము ఈ ప్రయత్నం చేశాం. వంశీకాంత్ రేఖన మ్యూజిక్ మా చిత్రానికి బ్యాక్ బోన్ అయ్యింది. "తిమ్మరాజుపల్లి టీవీ" ఒక మంచి సినిమా అనే ఇంప్రెషన్ ఫ్యామిలీ ఆడియెన్స్ లో ఉంది. వాళ్లంతా ఆహాలో మా మూవీ చూస్తారని ఆశిస్తున్నా. మంచి నోస్టాల్జిక్ ఫీల్ ఇచ్చే చిత్రమిది. తప్పకుండా ఆహాలో రేపటి నుంచి మా మూవీ చూడండి. నేను ఇప్పుడు చేస్తున్న చిత్రాల్లో చెన్నై లవ్ స్టోరీ షూటింగ్ కంప్లీట్ చేశాం, గువ్వలచెరువుఘాట్ షూటింగ్ చివరి దశలో ఉంది. నా డైరెక్షన్ లో చేస్తున్న సినిమా గురించి త్వరలో వివరాలు వెల్లడిస్తా. అన్నారు.



## మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' మేనియా ప్రారంభం

### దేశవ్యాప్తంగా ఎప్పుడూ చూడని వినూత్న ప్రచార కార్యక్రమం- పెద్ది పవర్‌ప్లే టూర్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మచ్ అవైటెడ్ రూరల్ యాక్షన్-స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'పై రోజురోజుకీ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా భారీ ప్రమోషన్స్‌తో చిత్రబృందం సినిమాపై హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్తోంది.ఇప్పటికే విడుదలైన రెండు హై-వోల్టేజ్ పాటలు, రెండు విభిన్న గ్లింప్సెస్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై భారీ బజ్ ఏర్పడింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. 'పెద్ది' జూన్ 4న గ్రాండ్ పాన్ ఇండియా రిలీజ్‌కు సిద్ధమవుతుండగా, జూన్ 3న స్పెషల్ ప్రీమియర్స్ ప్రదర్శించనున్నారు. ఇదిలా ఉండగా, ఇప్పటివరకు ఎప్పుడూ చూడని రీతిలో పాన్ ఇండియా ప్రమోషనల్ క్యాంపెయిన్‌ను టీమ్ ప్రారంభించింది. 'పెద్ది పవర్‌ప్లే టూర్' మే 18న ముంబైలో గ్రాండ్ ట్రైలర్ లాంచ్‌తో ప్రారంభం కానుంది. అన్ని ప్రధాన భాషల్లో థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. అక్కడి నుంచి ఈ ప్రమోషనల్ క్యాంపెయిన్ మరింత జోరందుకోనుంది. మే 22న ఉప్పల్ స్టేడియంలో జరగనున్న SRH vs RCB మ్యాచ్ సందర్భంగా చిత్రబృందం ప్రత్యేకంగా హాజరుకానుండటం ప్రధాన ఆకర్షణగా మారనుంది. అనంతరం మే 23న భోపాల్, మే 24న బెంగళూరు, మే 28న ఢిల్లీ, మే 30న చెన్నై, జూన్ 1న విజయనగరం, జూన్ 2న హైదరాబాద్‌లో భారీ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. అంతేకాదు, సమ్మర్ అంతా హైప్ కొనసాగించేలా మరిన్ని సర్‌ప్రైజ్‌లు కూడా సిద్ధం చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. "ఇది కేవలం ఆరంభం మాత్రమే. ఇంకా ఎన్నో సర్‌ప్రైజ్‌లు సిద్ధంగా ఉన్నాయి. మీకు అల్టిమేట్ సమ్మర్ ట్రీట్ అందించడానికి మేము ఎంతో కష్టపడ్డాం. మీ హాలిడేస్‌ను ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో నింపేందుకు జూన్ 4న ముందుగానే వస్తున్నాం. మా టీమ్ ప్రతి ఫ్రేమ్‌లో మనసు పెట్టి పని చేసింది. బిగ్ స్క్రీన్ పై మీరు ఈ అనుభూతిని ఆస్వాదించేందుకు మేము ఎంతగానో ఎదురుచూస్తున్నాం" అని మేకర్స్ తెలిపారు. ఇప్పటివరకు ఎప్పుడూ చూడని ఈ భారీ ప్రమోషనల్ క్యాంపెయిన్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచి 'పెద్ది'ను మరో స్థాయికి తీసుకెళ్లనుంది.

## శ్రీ అమ్మ భగవాన్ బోధనల నేపథ్యంలో "ఏదైనా సాధ్యమే" మూవీ

▪ ఫిలిం చాంబర్‌లో టైటిల్ ఆవిష్కరణ



హైదరాబాద్: ఆధ్యాత్మికతను, మానవ సంబంధాలను మేళవిస్తూ శ్రీ ఆది లక్ష్మి పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న సరికొత్త చిత్రం "ఏదైనా సాధ్యమే". ఈ సినిమాకు "దైవం తోడుంటే.." అనేది ఉపశీర్షిక. ఈ చిత్ర టైటిల్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు మద్దూరి రాజా, నిర్మాత అనిల్ మునగనూరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎస్. సుబ్రహ్మణ్యం, చిత్ర బృందం పాల్గొన్నారు. ప్రతి మనిషి తన ఇష్ట దైవంతో బలమైన అనుబంధాన్ని పెంచుకోవడం ద్వారా జీవితంలోని దుఃఖాల నుండి, బాధల నుండి ఎలా విముక్తి పొందవచ్చనే అంశాన్ని ఈ సినిమా ద్వారా చూపించనున్నారు. ముఖ్యంగా ఈ చిత్ర నిర్మాణం మొత్తం "శ్రీ అమ్మ భగవాన్" బోధనల ఆధారంగా రూపొందుతోందని చిత్ర యూనిట్ ప్రకటించింది. సినిమా కథనం ప్రధానంగా శ్రీ అమ్మ భగవాన్ చెప్పిన ఈ ఐదు సూత్రాల చుట్టూ తిరుగుతుందని వెల్లడించారు. "నీవు ప్రత్యేకమైన వ్యక్తివి, నీ ఆంతరంగిక ప్రపంచమే బాహ్య ప్రపంచం, వ్యక్తి లేడు, వ్యక్తిత్వాలు మాత్రమే ఉంటాయి, అంతర్గత సత్యము, జీవితమంటేనే బాంధవ్యాలు." ఈ అంశాల ఆధారంగానే సినిమా కథనం ఉంటుందని తెలిపారు. కథ, మాటలు, సాహిత్యాన్ని అందిస్తూ నిర్మిస్తున్న అనిల్ కుమార్ మునగనూరి మాట్లాడుతూ.. దేశానికి యువత ఎంతో ముఖ్యం. కానీ చాలా మంది నిరాశ లో, డిప్రెషన్ లో కూరుకుపోతున్నారు. ఒక వ్యక్తికి జీవితంలో భగవంతుడి బంధం ఉన్నట్లయితే ఎలాంటి అద్భుతాలు జరుగుతాయో, అసాధ్యాలు సుసాధ్యాలుగా మారుతాయి అనేది ఈ చిత్రం ద్వారా చెప్పదలుచుకున్నాము. ఆధ్యాత్మిక బోధనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. తమ ఇష్టందైవంతో అనుసంధానమైతే అద్భుతాలు జరుగుతాయి.. అని చెప్పారు. ఈ చిత్రానికి అనిల్ మునగనూరి కథ, మాటలు, సాహిత్యాన్ని అందించడమే కాకుండా నిర్మాణ బాధ్యతలను కూడా చేపట్టారు. రాజా మధురి దర్శకత్వం వహిస్తుండగా, రమేష్ సినిమాటోగ్రఫీని, ఫణీంద్ర ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను వెల్లడిస్తామని చిత్ర బృందం పేర్కొంది.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/A2380